సీఎంబీ చర్చిలో వుమెన్స్ సండే వేడుకలు

నాగర్ కర్నూల్, ఆగస్టు 23 (వుదయం ప్రతినిధి):

నాగర్‌కర్నూల్ సెంటినరీ సీఎంబీ చర్చిలో ఆదివారం వుమెన్స్ సండే వేడుకలు ఘనంగా నిర్వహించారు.ఈ కార్యక్రమానికి హైదరాబాద్ లోని హిత అకాడమీలో థియాలజీ ఫ్యాకల్టీగా విధులు నిర్వహిస్తున్న ఎం. శాంతకుమారి ముఖ్య ప్రసంగీకురాలిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ విశ్వాసులకు తల్లి అయిన శారా కుమార్తెలుగా క్రైస్తవ స్త్రీలందరూ క్రీస్తు ప్రేమలో, విశ్వాసంలో, భక్తిలో అభివృద్ధి చెంది కుటుంబానికి శాంతి సమాధానంగా ఉంటూ సంఘానికి, దేశానికి మార్గ నిర్దేశకులుగా ఉండాలని బోధించారు. అనంతరం మహిళా కమిటీ చైర్ పర్సన్ శ్రీమతి హుల్దా శ్రవణ్ కుమార్ మాట్లాడుతూ స్త్రీలందరూ ఏసు ప్రభువును విశ్వాసంలో, ప్రేమలో మాదిరిగా ఉంచుకొని సంఘానికి, దేశానికి ఉపయోగపడే విధంగా ఉండాలని సూచించారు.ఈ కార్యక్రమంలో సీఎంబీ చర్చి వుమెన్స్ కమిటీ సభ్యులు, సంఘస్తులు, యూత్ సుమారు 300 మంది పాల్గొన్నారు.

కంచే చేను మేసినట్లు ప్రవర్తించడం సభ్య సమాజం తలదించుకునేలా చేస్తోంది

విద్యార్థినిపై లెక్చరర్ లైంగిక వేధింపులు – పోక్సో కేసు నమోదు చేసి వెంటనే అరెస్ట్ చేయాలి!

జిల్లాసిఐటియు నాయకులు శ్రీనివాస్

తాండూరు ఆగస్టు 23 వుదయం ప్రతినిధి :

జ్ఞానాన్ని పంచాల్సిన లెక్చరర్, ఒక అమాయకపు ఇంటర్ విద్యార్థినిని మాయమాటలతో లొంగదీసుకొని వాట్సాప్ చాటింగ్ ద్వారా లైంగిక వేధింపులకు పాల్పడిన ఘటన తాండూరు పట్టణంలో తీవ్ర దుమారం రేపుతోంది. పవిత్రమైన విద్యాసంస్థల్లో ఇటువంటి నీచమైన చర్యలకు ఒడిగట్టడం సమాజానికి, విద్యావ్యవస్థకే ముప్పుగా మారింది.ఈ విచారకరమైన ఘటనపై సీఐటీయూ వికారాబాద్ జిల్లా ప్రధాన కార్యదర్శి కే. శ్రీనివాస్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. బాధితురాలికి న్యాయం జరగాలని డిమాండ్ చేస్తూ ఆయన పలు కీలక అంశాలను వెల్లడించారు:

పోక్సో కేసు నమోదు చేయాలి: బాలికపై లైంగిక వేధింపులకు పాల్పడిన సదరు లెక్చరర్‌పై తక్షణమే పోక్సో చట్టం కింద తీవ్రమైన కేసు నమోదు చేసి, వెంటనే అరెస్ట్ చేయాలి.రాజీ ప్రయత్నాలపై విచారణ: సదరు లెక్చరర్‌ను కాపాడేందుకు కొందరు రాజకీయ నాయకుల అండదండలతో, మధ్యవర్తుల ద్వారా భారీగా డబ్బులు చేతులు మార్చి వ్యవహారాన్ని సర్దుబాటు చేసేందుకు ప్రయత్నిస్తున్నారని ఆరోపించారు.

లెక్చరర్ ప్రవర్తన – సామాజిక విశ్లేషణ: పాఠశాలలు, కళాశాలలు విద్యార్థులకు సురక్షితమైన ప్రదేశాలుగా ఉండాలి. పిల్లల భవిష్యత్తును తీర్చిదిద్దాల్సిన ఉపాధ్యాయుడే ఇలాంటి చౌకబారు మాయమాటలతో వేధింపులకు పాల్పడటం తీవ్రంగా ఖండించదగినది. డిజిటల్ మాధ్యమాలను దుర్వినియోగం చేస్తూ బాలిక మానసిక స్థైర్యాన్ని దెబ్బతీసే ఇటువంటి వారిని సమాజంలో ఏమాత్రం ఉపేక్షించకూడదు.ఇలాంటి ఘటనల్లో రాజకీయ ప్రమేయం లేదా ఆర్థిక లావాదేవీలతో రాజీపడటం అంటే నేరస్థుడిని మరిన్ని నేరాలకు ప్రోత్సహించడమే అవుతుంది. పోలీసులు, విద్యాశాఖ అధికారులు తక్షణమే స్పందించి బాధితురాలికి రక్షణ కల్పించి, దోషికి కఠినమైన శిక్ష పడేలా చూస్తేనే విద్యావ్యవస్థపై సమాజానికి ఉన్న నమ్మకం నిలబడుతుంది అని అన్నారు.

చిన్నారులతో మమేకమైన అడిషనల్ కలెక్టర్ లక్ష్మీకిరణ్

కోహెడ ఆగస్టు 23 (వుదయం ప్రతినిధి)

కూరెళ్ల గ్రామంలో "పల్లె పల్లెకు పొన్నం అన్న - పల్లె పల్లెలో ప్రజా పాలన" కార్యక్రమంలో ఓ ఆహ్లాదకర దృశ్యం వుదయం ప్రతినిధి కెమెరాకు చిక్కింది. సిద్దిపేట జిల్లా పరిధిలోని కూరెళ్ల గ్రామంలో నిర్వహించిన "పల్లె పల్లెకు పొన్నం అన్న - పల్లె పల్లెలో ప్రజా పాలన" కార్యక్రమంలో అడిషనల్ కలెక్టర్ లక్ష్మీకిరణ్ అధికారికంగా పాల్గొన్నారు. గ్రామంలో ప్రజల సమస్యలను తెలుసుకుంటూ కార్యక్రమంలో భాగంగా పర్యటించిన ఆమెకు అక్కడి చిన్నారులతో ఎదురైన ఓ ఆత్మీయ సంఘటన అందరినీ ఆకట్టుకుంది. గ్రామంలోని చిన్నారులను చూసిన అడిషనల్ కలెక్టర్ లక్ష్మీకిరణ్ వారితో కొద్దిసేపు మమేకమయ్యారు. వారి చదువు, పాఠశాల, ఆటపాటలు, రోజువారీ కార్యకలాపాల గురించి ఆప్యాయంగా అడిగి తెలుసుకున్నారు. అధికారిక కార్యక్రమంలో భాగంగా వచ్చిన ఆమెను చూసిన చిన్నారులు కూడా అమాయకంగా "మీరెవరు? ఎక్కడి నుంచి వచ్చారు? సిద్దిపేట నుంచి వచ్చారా?" అంటూ ఆసక్తిగా ప్రశ్నించారు.చిన్నారుల అమాయక ప్రశ్నలకు అడిషనల్ కలెక్టర్ చిరునవ్వుతో సమాధానమిస్తూ వారితో సరదాగా మాట్లాడారు. దీంతో అక్కడే ఉన్న అధికారులు, ప్రజాప్రతినిధులు, గ్రామస్తుల మధ్య ఒక్కసారిగా ఆహ్లాదకర వాతావరణం నెలకొంది.ప్రజా సమస్యల పరిష్కారం, అభివృద్ధి కార్యక్రమాల పరిశీలన కోసం వచ్చిన అధికార యంత్రాంగం చిన్నారులతో ఇలా మమేకం కావడం గ్రామస్తులను ఆకట్టుకుంది. ఒక నిమిషం పాటు అధికారిక హడావుడి పక్కకు వెళ్లి, చిన్నారుల నవ్వులు-ఆనందాలతో ఆ ప్రాంగణం నిండిపోయింది.అధికారులు ప్రజలతో, ముఖ్యంగా చిన్నారులతో ఆప్యాయంగా మెలగడం ద్వారా ప్రభుత్వ యంత్రాంగం ప్రజలకు మరింత చేరువవుతుందనే సందేశాన్ని ఈ ఘటన చాటిచెప్పింది. కూరెళ్ల గ్రామంలో చోటుచేసుకున్న ఈ చిన్న సంఘటన కార్యక్రమానికి ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది.

పేద కుటుంబానికి లయన్స్ క్లబ్ చేయూత

సిద్దిపేట/జగదేవపూర్, ఆగస్టు 23 (వుదయం ప్రతినిధి)

సిద్దిపేట జిల్లా జగదేవపూర్ మండలం తిగుల్ గ్రామానికి చెందిన జంగని భద్రమ్మ ఇటీవల అనారోగ్యంతో మృతి చెందగా, ఆమె కుటుంబాన్ని ఆదివారం లయన్స్ క్లబ్ గజ్వేల్ స్నేహ సభ్యులు పరామర్శించారు. క్లబ్ అధ్యక్షుడు డాక్టర్ కుమారస్వామి, కోశాధికారి దొంతుల సత్యనారాయణ, దూబకుంట లక్ష్మయ్య, గౌరయ్యలు భద్రమ్మ కుటుంబ స్థితిగతులను అడిగి తెలుసుకుని, ఆర్థిక సాయంతో పాటు నెల రోజులకు సరిపడా నిత్యావసర సరుకులు, బియ్యాన్ని అందజేశారు. ఈ సందర్భంగా డాక్టర్ కుమారస్వామి మాట్లాడుతూ, ఇంటి పెద్ద దిక్కును కోల్పోయి ఒంటరిగా మిగిలిన ఆ కుటుంబానికి లయన్స్ క్లబ్ ఎల్లప్పుడూ అండగా ఉంటుందని హామీ ఇచ్చారు. ప్రతీ ఒక్కరూ తమ సంపాదనలో కొంత భాగాన్ని పేదల సాయానికి కేటాయించాలని, సమాజంలోని మానవతావాదులు ఈ కుటుంబానికి తోడ్పాటు అందించాలని ఆయన కోరారు.

గ్రామాల అభివృద్ధికి ప్రభుత్వం కట్టుబడి ఉంది: మంత్రి పొన్నం ప్రభాకర్

మంత్రి పొన్నం ప్రభాకర్

కోహెడ, ఆగస్టు 23: (వుదయం ప్రతినిధి)

గ్రామీణ ప్రాంతాల సమగ్ర అభివృద్ధి, ప్రజల సమస్యల పరిష్కారమే ప్రజా పాలన ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని రాష్ట్ర మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. సిద్దిపేట జిల్లా హుస్నాబాద్ నియోజకవర్గం కోహెడ మండలంలో నిర్వహించిన "పల్లె పల్లెకు పొన్నం అన్న - పల్లె పల్లెలో ప్రజా పాలన" కార్యక్రమంలో భాగంగా ఆదివారం మంత్రి పొన్నం ప్రభాకర్ శనిగరం, తంగళ్లపల్లి, గుండారెడ్డిపల్లి, కూరెళ్ల, వెంకటేశ్వర్లపల్లి గ్రామాల్లో పర్యటించారు. ఈ సందర్భంగా అభివృద్ధి పనులను పరిశీలించడంతో పాటు ప్రజల సమస్యలను నేరుగా తెలుసుకుని వాటి పరిష్కారానికి చర్యలు చేపట్టారు.

ఈ పర్యటనలో భాగంగా

గుండారెడ్డిపల్లి గ్రామ పంచాయతీ కార్యాలయం వద్ద నిర్వహించిన కార్యక్రమంలో అధికారులు, ప్రజాప్రతినిధులతో కలిసి గ్రామ అభివృద్ధి, సంక్షేమ పథకాల అమలుపై మంత్రి సమీక్ష నిర్వహించారు. గ్రామంలో చేపట్టాల్సిన అభివృద్ధి పనులు, ప్రజలకు అందుతున్న సంక్షేమ పథకాలపై అధికారులను వివరాలు అడిగి తెలుసుకున్నారు.

అభివృద్ధి పనులకు శ్రీకారం

ఈ సందర్భంగా రూ.18 లక్షల వ్యయంతో నిర్మించిన మహిళా సమైక్య భవనాన్ని మంత్రి ప్రారంభించారు. అలాగే రూ.15 లక్షల వ్యయంతో నిర్మించిన అంతర్గత సీసీ రోడ్లను ప్రారంభించారు. నక్క తనూజా-విజయ్‌కుమార్ దంపతుల నూతన ఇందిరమ్మ ఇంటిని ప్రారంభించి వారికి శుభాకాంక్షలు తెలిపారు.

సంక్షేమ పథకాల అమలులో పురోగతి

గుండారెడ్డిపల్లి గ్రామంలో ప్రజా పాలన ప్రభుత్వ హయాంలో 16 ఇందిరమ్మ ఇళ్లు మంజూరయ్యాయని అధికారులు తెలిపారు. రెండో దశలో మరిన్ని ఇళ్లు మంజూరు చేయనున్నట్లు వెల్లడించారు. 170 కొత్త రేషన్ కార్డులు మంజూరు చేసి లబ్ధిదారులకు సన్నబియ్యం పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు. అర్హులైన వారికి స్మార్ట్ రేషన్ కార్డులు కూడా పంపిణీ చేసినట్లు పేర్కొన్నారు. గృహజ్యోతి పథకం కింద 456 మంది లబ్ధిదారులకు 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్ అందుతుండగా, 455 మంది లబ్ధిదారులకు రూ.500 గ్యాస్ సబ్సిడీ అందిస్తున్నట్లు అధికారులు తెలిపారు. గ్రామంలో రూ.22.50 లక్షలతో సీసీ రోడ్ల నిర్మాణం పూర్తి చేయగా, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో రూ.10 లక్షలతో ప్రహరీ గోడ నిర్మించినట్లు వివరించారు.రైతులకు రూ.2.80 కోట్ల మేర రైతు రుణమాఫీ జరిగిందని, రైతు బీమా కింద తొమ్మిది రైతు కుటుంబాలకు రూ.45 లక్షలు విడుదలయ్యాయని తెలిపారు. తొమ్మిది మంది లబ్ధిదారులకు కళ్యాణలక్ష్మి చెక్కులు అందించడంతో పాటు రైతు భరోసా నిధులు కూడా విడుదల చేసినట్లు అధికారులు వెల్లడించారు.

గ్రామ సమస్యలపై మంత్రి దృష్టి

గ్రామ సర్పంచ్ పిల్లి బాబు ప్రజల తరపున తాగునీరు, ఓపెన్ జిమ్, ఆర్టీసీ బస్సు సౌకర్యం, ఐకేపీ భవనం, కోతుల బెడద, ప్రభుత్వ పాఠశాలలో మరుగుదొడ్లు, వంతెన నిర్మాణం, విద్యుత్ పోల్స్ మార్పు, సాగునీరు, కమ్యూనిటీ హాళ్లు, బీటీ రోడ్డు, భూ సమస్యలు తదితర అంశాలను మంత్రి దృష్టికి తీసుకువచ్చారు.దీనిపై స్పందించిన మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ గుండారెడ్డిపల్లి గ్రామానికి ఇప్పటికే రూ.15 లక్షలతో సీసీ రోడ్ల పనులు మంజూరు చేశామని తెలిపారు. అదనంగా మరో రూ.40 లక్షలతో గ్రామంలో సీసీ రోడ్ల నిర్మాణాన్ని పూర్తి చేస్తామని హామీ ఇచ్చారు. ప్రజలు, సర్పంచ్ ప్రస్తావించిన సమస్యలను ప్రాధాన్యత క్రమంలో పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు.

గౌరవెల్లి ప్రాజెక్టుతో సాగునీరు

గౌరవెల్లి ప్రాజెక్టు కాలువలకు సంబంధించిన భూసేకరణ ప్రక్రియ కొనసాగుతోందని మంత్రి తెలిపారు. భూసేకరణకు అవసరమైన నిధులు విడుదలయ్యాయని, త్వరలోనే ప్రాజెక్టు పనులను పూర్తి చేసి రైతులకు సాగునీరు అందించేలా చర్యలు తీసుకుంటామని చెప్పారు.

బస్వాపూర్-బద్దిపడగ మీదుగా గుండారెడ్డిపల్లికి సాగునీరు అందించే అంశంతో పాటు రంగనాయకసాగర్ నీటి సమస్య పరిష్కారానికి సంబంధిత మంత్రితో మాట్లాడి చర్యలు తీసుకుంటామని తెలిపారు. గ్రామంలో తాగునీటి సమస్య పరిష్కారానికి డెడికేటెడ్ వాటర్ లైన్ ఏర్పాటు చేయనున్నట్లు వెల్లడించారు.

ఆరుతడి పంటలు, ఆయిల్‌పామ్ సాగుకు ప్రాధాన్యం

ఎల్‌నినో ప్రభావంతో వర్షాభావ పరిస్థితులు ఏర్పడే అవకాశం ఉన్నందున రైతులు నీటి లభ్యతను దృష్టిలో ఉంచుకుని ఆరుతడి పంటలు సాగు చేయాలని మంత్రి సూచించారు. ఆయిల్‌పామ్ సాగును ప్రోత్సహించేందుకు ప్రభుత్వం అవసరమైన సహకారం అందిస్తుందని తెలిపారు.జలసిరి పథకం కింద ప్రతి ఇంటి వద్ద ఇంకుడు గుంతలు నిర్మించుకోవాలని, నీటి సంరక్షణలో ప్రజలు భాగస్వాములు కావాలని కోరారు. ప్లాస్టిక్ వినియోగాన్ని తగ్గించి విస్తృతంగా మొక్కలు నాటాలని, గ్రామాల్లో స్టీల్ బ్యాంకుల వినియోగాన్ని ప్రోత్సహించాలని సూచించారు.

అర్హులు పెన్షన్లకు దరఖాస్తు చేసుకోవాలి

ఈ నెల 31వ తేదీ వరకు పెన్షన్ల దరఖాస్తు ప్రక్రియ కొనసాగుతుందని మంత్రి తెలిపారు. వితంతువులు, ఒంటరి మహిళలు, దివ్యాంగులు, గీత కార్మికులు, చేనేత కార్మికులు, బోదకాలు, తలసేమియా, హెచ్ఐవీ బాధితులు తదితర అర్హులు ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకునేందుకు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

రహదారులు, విద్యా మౌలిక వసతులకు ప్రాధాన్యం

తంగళ్లపల్లి నుంచి బద్దిపడగ వరకు రూ.6.50 కోట్లతో రోడ్డు పనులు మంజూరు చేసినట్లు మంత్రి తెలిపారు. మరో రూ.1.50 కోట్లతో తంగళ్లపల్లి మీదుగా రోడ్డు పనులు చేపడుతున్నామని చెప్పారు. సమీపంలో యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్ నిర్మాణం చేపడుతున్నట్లు వెల్లడించారు.SIRలో ఎన్యూమరేషన్‌కు సంబంధించిన ఓట్ల విషయంలో అర్హులైన వారికి నోటీసులు జారీ చేసి, వారు కోరిన ఫారాలను అందించాలని అధికారులను మంత్రి ఆదేశించారు. గుండారెడ్డిపల్లి గ్రామ అభివృద్ధికి ప్రభుత్వం అన్ని విధాలా సహకరిస్తుందని మంత్రి పొన్నం ప్రభాకర్ స్పష్టం చేశారు. ప్రజల వద్దకు వెళ్లి సమస్యలను నేరుగా తెలుసుకుని, వాటి పరిష్కారానికి చర్యలు తీసుకోవడమే ప్రజా పాలన లక్ష్యమని పేర్కొన్నారు .ఈ కార్యక్రమంలో అడిషనల్ కలెక్టర్ లక్ష్మీకిరణ్, సర్పంచ్ పిల్లి బాబు, జిల్లా, మండల స్థాయి అధికారులు, ప్రజాప్రతినిధులు, రైతులు, మహిళా సంఘాల సభ్యులు, గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

తృటిలో తప్పిన పెను ప్రమాదం.. టైరు ఊడి అదుపుతప్పిన స్కూల్ బస్సు

- **విద్యార్థులు లేకపోవడంతో తప్పిన ముప్పు**
- **ఫిట్‌నెస్ లేని బస్సులపై అధికారుల పర్యవేక్షణ ఏదీ?**
- **ప్రైవేట్ స్కూల్ బస్సుల భద్రతపై తల్లిదండ్రుల ఆందోళన**

మిరుదొడ్డి, ఆగస్టు 23 (వుదయం)

ఫిట్‌నెస్ లేని ప్రైవేట్ పాఠశాల బస్సుల నిర్వహణ తీరుతో విద్యార్థుల భద్రత ప్రశ్నార్థకంగా మారుతోంది. సిద్దిపేట జిల్లా మిరుదొడ్డి మండల కేంద్రంలో టైరు ఊడిపోవడంతో ఓ ప్రైవేట్ పాఠశాల బస్సు అదుపుతప్పి రోడ్డు పక్కకు దూసుకెళ్లింది. అయితే బస్సులో విద్యార్థులు ఎవరూ లేకపోవడంతో పెను ప్రమాదం తప్పింది.మిరుదొడ్డి నుంచి అందే గ్రామానికి విద్యార్థులను తీసుకురావడానికి శనివారం ఉదయం వెళ్తుండగా ఈ ఘటన చోటుచేసుకుంది. బస్సు ముందు చక్రం ఒక్కసారిగా ఊడిపోవడంతో డ్రైవర్ నియంత్రణ కోల్పోయాడు. దీంతో బస్సు రోడ్డు పక్కకు దూసుకెళ్లి ఆగిపోయింది.ఈ ఘటన ఆలస్యంగా వెలుగులోకి రావడంతో స్థానికులు ఆందోళన వ్యక్తం చేశారు. ఫిట్‌నెస్ లేని బస్సులను ప్రైవేట్ పాఠశాలల యాజమాన్యాలు నడుపుతున్నా సంబంధిత అధికారులు పట్టించుకోవడం లేదని ఆరోపించారు. కాసుల కోసం విద్యార్థుల ప్రాణాలను పణంగా పెట్టడం సరికాదని తల్లిదండ్రులు, స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేశారు. అంతే కాకుండా పాఠశాల బస్సుల్లో పరిమితికి మించి విద్యార్థులను తరలిస్తున్నారని, నిబంధనలు ఉల్లంఘిస్తున్న వాహనాలపై ఆర్టీఓ, విద్యాశాఖ అధికారులు తగిన చర్యలు తీసుకోవడం లేదని మండిపడ్డారు. ప్రైవేట్ పాఠశాలల వాహనాలపై ప్రత్యేక తనిఖీలు నిర్వహించి, ఫిట్‌నెస్ లేని బస్సులను వెంటనే నిలిపివేయాలని డిమాండ్ చేశారు.

ముదిరాజ్ జర్నలిస్టుల సంక్షేమం, హక్కుల పోరాటమే ధ్యేయం

సిద్దిపేట జిల్లా కో-కన్వీనర్‌గా బరిగె నర్సింలు ముదిరాజ్ ఏకగ్రీవ ఎన్నిక

సిద్దిపేట, ఆగస్టు 23 (వుదయం బ్యూరో)

జిల్లాలోని ముదిరాజ్ జర్నలిస్టులను ఒకే వేదికపైకి తెచ్చి, వారి సంక్షేమం మరియు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికై అహర్నిశలు కృషి చేస్తానని తెలంగాణ రాష్ట్ర జర్నలిస్టు సంఘం సిద్దిపేట జిల్లా నూతన కోకన్వీనర్ బరిగె నర్సింలు ముదిరాజ్ స్పష్టం చేశారు. ఆదివారం సికింద్రాబాద్‌లోని ముదిరాజ్ భవన్‌లో తెలంగాణ రాష్ట్ర జర్నలిస్టు సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన ప్రతినిధుల సమావేశంలో జగదేవపూర్ మండలం చాట్లపల్లి గ్రామానికి చెందిన బరిగె నర్సింలు ముదిరాజ్‌ను సిద్దిపేట జిల్లా కోకన్వీనర్‌గా ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా సంఘం రాష్ట్ర అధ్యక్షులు నీలకంఠం ముదిరాజ్, ప్రధాన కార్యదర్శి శ్రీనివాస్‌లు ఆయనకు నియామక పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా నర్సింలు ముదిరాజ్ మాట్లాడుతూ జిల్లాలోని జర్నలిస్టులందరినీ ఏకం చేసి వారి హక్కుల సాధనకు నిరంతరం పోరాడతానని, తమపై నమ్మకంతో బాధ్యతలు అప్పగించిన రాష్ట్ర నాయకత్వానికి, సిద్దిపేట జిల్లా జర్నలిస్టు మిత్రులందరికీ కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో సిద్దిపేట జిల్లా కన్వీనర్ పరమేశ్వర్, జర్నలిస్ట్ నాయకులు బాకీ నర్సింలు, ఇప్ప నర్సింలు, సాయి కుమార్ ముదిరాజ్ మరియు వివిధ జిల్లాల జర్నలిస్టు ప్రతినిధులు పాల్గొన్నారు.

కోట్‌పల్లి ప్రాజెక్టు పేరుతో ఇసుక దందా!

చంద్రవంచ వాగును ఊడ్చేస్తున్న కాంట్రాక్టర్

రోజుకు 20 టిప్పర్లతో అక్రమ తరలింపు.. ఒక్కో టిప్పర్ రూ. 40 వేలకు విక్రయం!

అధికారులు, ప్రజాప్రతినిధుల మౌనంపై వెల్లువెత్తుతున్న నిరసనలు

తాండూరు (ప్రభ న్యూస్/ప్రత్యేక ప్రతినిధి):

కోట్‌పల్లి ప్రాజెక్టు నిర్మాణం పేరిట తాండూరు మండల పరిధిలోని చంద్రవంచ వాగులో అక్రమ ఇసుక దందా మూడేళ్లగా విచ్చలవిడిగా సాగుతోంది. ప్రాజెక్టు పనుల వంకతో కాంట్రాక్టర్ చంద్రవంచ వాగును ఖాళీ చేస్తూ కోట్ల రూపాయలు వెనకేసుకుంటున్నా, సంబంధిత అధికారులు చూసీచూడనట్లు వ్యవహరిస్తుండటంపై స్థానిక ప్రజలు, రైతులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.అనుమతుల ముసుగులో బహిరంగ దోపిడీ ఎడారిగా మారుతున్న చంద్రవంచ వాగు.. రైతుల ఆందోళనఅసలే వర్షాభావ పరిస్థితులతో కరువు మేఘాలు అలుముకోగా, వాగులో ఇసుకను విచ్చలవిడిగా తోడేస్తుండటంతో భూగర్భ జలాలు దారుణంగా పడిపోతున్నాయి. ఇసుక నిల్వలు లేకపోతే వాగులో నీరు ఇంకే అవకాశం లేకుండా పోతుందని, దీని వల్ల చంద్రవంచతో పాటు చుట్టుపక్కల గ్రామాల బావులు, బోర్లు ఎండిపోయి తాగు, సాగునీటి తీవ్ర సమస్య ఏర్పడుతుందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ధర్నాలు చేసినా ఫలితం శూన్యం

అధికారులు స్పందించాలి

వెంటనే జిల్లా కలెక్టర్, మైనింగ్ మరియు రెవెన్యూ ఉన్నతాధికారులు స్పందించి చంద్రవంచ వాగులో జరుగుతున్న అక్రమ ఇసుక తోడకాన్ని తక్షణమే నిలిపివేయాలని, ప్రాజెక్టు పేరిట జరుగుతున్న ఈ దోపిడీపై సమగ్ర విచారణ జరిపి బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు డిమాండ్ చేస్తున్నారు.

సీసీ రోడ్డు రోడ్డు పనులకు ఎమ్మెల్యే మహిపాల్ రెడ్డి శ్రీకారం

వుదయం, తెల్లాపూర్ ప్రతినిధి(ఆగస్టు 23)

రామచంద్రపురం మండలం తెల్లాపూర్ డివిజన్ ఉస్మాన్ నగర్‌లోని సైబర్ కాలనీ B మ్యాథ్స్‌లో రూ.7 లక్షల వ్యయంతో 100 మీటర్ల సీసీ రోడ్డు నిర్మాణ పనులను పటాన్‌చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి ప్రారంభించారు. మాజీ కౌన్సిలర్ చిట్టి ఉమేష్ సొంత నిధులతో ఈ రోడ్డు నిర్మాణాన్ని చేపట్టారు. ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి మాట్లాడుతూ.. నియోజకవర్గంలో ప్రజలకు అవసరమైన మౌలిక వసతుల కల్పనకు ప్రాధాన్యతనిస్తూ అభివృద్ధి పనులు కొనసాగిస్తామని తెలిపారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ మాజీ అధ్యక్షుడు రాగం దేవేందర్ యాదవ్, మాజీ కౌన్సిలర్లు కంజర్ల శ్రీశైలం, నాగరాజు, బీఆర్ఎస్ యువనాయకుడు బాలగౌని సాయిచరణ్ గౌడ్, బీఆర్ఎస్ నాయకులు దయాకర్ రెడ్డి, గుడ్ల సాగర్, ఇంద్రారెడ్డి, బొల్లారం శ్రీశైలం, గ్రామస్తులు రవీందర్ రెడ్డి, ప్రేమ్ కుమార్, కుమ్మరి రాజు, మల్లయ్య, శ్రీశైలం, B మ్యాథ్స్ అధ్యక్షుడు కె. సంజీవ ప్రసాద్, ఉపాధ్యక్షుడు పి. మాధవరావు, ప్రధాన కార్యదర్శి డి. ఏడుకొండలు, సంయుక్త కార్యదర్శి బి. ప్రభాకర్ రెడ్డి, కోశాధికారి జె. వాసుదేవరావు, డైరెక్టర్లు వి. గోవర్ధన్, ఎం. సందీప్ రెడ్డి, యు. సురయ్య, ఎం. ఆనంద్, మాజీ అధ్యక్షుడు జె. శివనారాయణ పాల్గొన్నారు.

ఈ నెల 27న ఉచిత కంటిచికిత్స శిబిరం

నాగర్ కర్నూల్, ఆగస్టు 23 (వుదయం బ్యూరో):

జిల్లా వైద్య ఆరోగ్య శాఖ, జిల్లా అంధత్వ నియంత్రణ సంస్థ ఆధ్వర్యంలో ఈ నెల 27న గురువారం ఉదయం 9 గంటల నుండి 11 గంటల వరకు ఉచిత కంటి చికిత్స శిబిరం నిర్వహిస్తున్నట్లు నాగర్‌కర్నూల్ ఆప్తాల్మిక్ అధికారి కొట్ర బాలాజీ ఆదివారం నాడు ఒక ప్రకటనలో తెలిపారు.జిల్లా కేంద్రంలోని పాత కలెక్టరేట్ భవనంలోని గది నెంబర్ 102 లో ఈ కంటి శిబిరం నిర్వహించి వచ్చిన రోగులకు కంటి పరీక్షలు నిర్వహిస్తామన్నారు. శిబిరంలో రోగులకు ప్రత్యేక కంటి పరీక్షలు, సాధారణ పరీక్షలు నిర్వహించి అందులో అవసరమైన వారికి, క్యాటరాక్ట్ పొర గల వారికి ఉచితంగా కంటి ఆపరేషన్లు మహబూబ్ నగర్ ఏనుగొండలోని లయన్ రామ్ రెడ్డి కంటి ఆసుపత్రిలో నిర్వహిస్తామని తెలిపారు. రోగులను ప్రత్యేక అంబులెన్స్ ద్వారా ఏనుగొండకు పంపనున్నట్లు తెలిపారు. రోగులు ముందుగా బీపీ, షుగర్ పరీక్షలు చేసుకొని రిపోర్టు వెంట తెచ్చుకోవాలని, అలాగే ఆధార్ కార్డు, రేషన్ కార్డు, ఓటర్ కార్డు లేదా ఏదైనా గుర్తింపు కార్డు జిరాక్స్ కాపీ, ఫోన్ నంబర్ వెంట తెచ్చుకోవాలని సూచించారు. వివరాలకు 9440876556, 7386940480 నంబర్లలో సంప్రదించాలన్నారు.

గుప్త నిధుల కోసం త్రవ్వకాలు జరిపిన ముగ్గురిపై కేసులు నమోదు

వెల్దండ ఆగస్టు 23 (వు దయం)

మండల పరిధిలోని రాచూరు తండా సమీపంలో కొంతమంది గుప్త నిధులు ఉన్నాయని పూజలు చేసి జెసిబి తో తోగుంతలు తవ్వుతున్న ముగ్గురు వ్యక్తులను పట్టుకుని వర్బే కేసు నమోదు చేసినట్లు ఎస్సై యుగంధర్ రెడ్డి తెలిపారు వివరాల్లోకెళ్తే గ్రామస్తుల సమాచారం మేరకు పోలీసులు వెళ్లగా అక్కడికి రాచూరి తండా చెందిన సుమారు ఒక 20 30 మంది అక్కడ ఉ నట్లు వారి సమక్షంలో ముగ్గురు వ్యక్తులు ఒక జెసిబి ఉన్నట్లు విచారించగా అక్కడ కొంతమంది గుప్త నిధులు ఉన్నాయని అనుమానంతో పూజలు నిర్వహించి జెసిబి తో తవ్వుతుండగా ముగ్గురు వ్యక్తులను, ఒక మోటార్ సైకిల్ మరియు జెసిబి ని తీసుకొని పోలీస్ స్టేషన్కు గుత్తి సత్యనారాయణ, , కేతవత్ శంకర్, , ,క్యాసారపు శ్రీశైలం మరియు మరి కొంత మంది పై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు

విద్యార్థుల భద్రతతో చెలగాటమా?

- **మల్లారెడ్డి విద్యాసంస్థలపై సమగ్ర విచారణ జరపాలి**
- **దుబ్బాక బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు పాతూరి వెంకటస్వామి గౌడ్**

వుదయం, సిద్దిపేట

విద్యార్థుల భవిష్యత్తును తీర్చిదిద్దాల్సిన కళాశాల ప్రాంగణాన్ని సినిమా ప్రమోషన్ కార్యక్రమాలకు వేదికగా మార్చడం సిగ్గుచేటని దుబ్బాక బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు పాతూరి వెంకటస్వామి గౌడ్ తీవ్రంగా విమర్శించారు.ఆగస్టు 22న మల్లారెడ్డి విద్యాసంస్థల ప్రాంగణంలో నిర్వహించిన టాక్సికో సినిమా ప్రీరిలీజ్ ఈవెంట్‌లో తొక్కిసలాట జరిగి ఇద్దరు విద్యార్థులు గా

మంత్రి కొండా సురేఖకు నోటీసు బీసీల ఆత్మగౌరవంపై దాడే : అచ్చ వినోద్ కుమార్

వరంగల్, ఆగస్టు 23 (వుదయం ప్రతినిధి) :

రాష్ట్ర మంత్రి కొండా సురేఖకు నోటీసులు ఇవ్వడం ముమ్మాటికీ బీసీల ఆత్మగౌరవాన్ని దెబ్బతీయడమేనని పెరుక సంఘం వరంగల్ జిల్లా అధ్యక్షులు, సామాజిక న్యాయ వేదిక జిల్లా ప్రధాన కార్యదర్శి అచ్చ వినోద్ కుమార్ తీవ్రంగా విమర్శించారు. రాష్ట్రంలో బీసీలపై రోజురోజుకూ పెరుగుతున్న దాడులు విచారకరమని ఆందోళన వ్యక్తం చేశారు. కాంగ్రెస్ పార్టీలోని బీసీ మంత్రులపై అగ్రకుల నాయకులు, ప్రజా ప్రతినిధులు వేధింపులకు గురిచేస్తుంటే మౌనంగా ఉండటం సరికాదన్నారు. అచ్చ కాంగ్రెస్ వాదులు ప్రభుత్వం, వారి అవినీతిని ప్రశ్నిస్తే నోరుమెదపని వలస కాంగ్రెస్ వాదులు...

ఒక బీసీ మహిళా మంత్రి ప్రశ్నిస్తే మాత్రం ఎక్కడ లేని వీరంగం చేస్తున్నారని, ఇది నేరపూరిత రాజకీయాలకు అద్దం పడుతోందని ధ్వజమెత్తారు. బీసీ మంత్రి కొండా సురేఖను పదవి నుంచి సాగనంపాలని కొన్ని సమైక్యవాద పత్రికలు పెద్ద పెద్ద హెడ్డింగులతో దుష్ప్రచారం చేస్తున్నాయని మండిపడ్డారు.

రాష్ట్రంలో 85 శాతం దళిత, బహుజన ఓటు బ్యాంక్ ఉందని, ఇప్పుడు వారిలో రాజకీయ చైతన్యం వచ్చిందని వినోద్ కుమార్ గుర్తుచేశారు. సమైక్యవాద పత్రికలు ఎంత గోబెల్స్ ప్రచారం చేసినా, కొండా సురేఖను కదిలించే ధైర్యం అగ్రకుల సమైక్యవాదులకు లేదని స్పష్టం చేశారు. సీఎం రేవంత్ రెడ్డి ఎమ్మెల్యే కాకముందే కొండా సురేఖ మంత్రిగా పనిచేసిన సుదీర్ఘ అనుభవం ఉందన్నారు. కాంగ్రెస్ అధిష్టానం, సోనియా గాంధీ వద్ద ఆమెకు మంచి గుర్తింపు ఉందన్నారు. బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ వర్గాలపై కుట్రలు పన్నితే అగ్రకుల అహంకారులకు కర్రు కాల్చి వాత పెట్టేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారని హెచ్చరించారు.

కాంగ్రెస్ అధిష్టానం బీసీల ఆత్మగౌరవాన్ని దెబ్బతీసేలా మంత్రి సురేఖను మార్చాలని చూస్తే, రాష్ట్రవ్యాప్తంగా మరో బీసీ ఉద్యమం చేపట్టడం ఖాయమని అచ్చ వినోద్ కుమార్ స్పష్టం చేశారు.

సీపీఎస్ రద్దు చేసి పాత పెన్షన్ విధానం పునరుద్ధరించాలి

ప్రభుత్వాన్ని డిమాండ్ చేసిన టీఎస్ సీపీఎస్ ఉద్యోగుల జిల్లా అధ్యక్షుడు లక్కపాక ప్రవీణ్

సూర్యాపేట, ఆగస్టు 23 (వుదయం ప్రతినిధి):

కంట్రిబ్యూటరీ పెన్షన్ స్కీం (సీపీఎస్) విధానాన్ని రద్దు చేసి, ఉద్యోగులకు పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించాలని తెలంగాణ రాష్ట్ర కంట్రిబ్యూటరీ పెన్షన్ స్కీం ఎంప్లాయిస్ జిల్లా అధ్యక్షుడు లక్కపాక ప్రవీణ్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.ఆదివారం హైదరాబాద్ లోని ఎల్బీ స్టేడియంలో నిర్వహించనున్న సీపీఎస్ ఉద్యోగుల చలో హైదరాబాద్ కార్యక్రమానికి సూర్యాపేట జిల్లా కేంద్రం నుంచి ఉద్యోగులతో కలిసి బయలుదేరిన సందర్భంగా ఆయన మాట్లాడారు.సీపీఎస్ విధానం వల్ల ఉద్యోగులకు భవిష్యత్తులో ఆర్థిక భద్రతపై తీవ్ర ఆందోళన నెలకొందని ఆయన అన్నారు. ఉద్యోగుల ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని ప్రభుత్వం వెంటనే సీపీఎస్ ను రద్దు చేసి, పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలని కోరారు. ఉద్యోగుల న్యాయమైన డిమాండ్లను ప్రభుత్వం సానుకూలంగా పరిశీలించి పాత పెన్షన్ అమలు దిశగా చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు.ఈ కార్యక్రమంలో జిల్లా కోశాధికారి గుయ్యని ప్రసాద్, సతీష్, మౌనిష్ వర్మ, వంశీ, సతీష్, జోష్ణ, పుష్పలత, శైలజ, సరిత, సునీత పాల్గొన్నారు

25న జరిగే సర్పంచ్ ల చైతన్య సదస్సును జయప్రదం చేయండి

సర్పంచ్ ల సమస్యలను ప్రభుత్వం పరిష్కరించాలి
విలేకరుల సమావేశంలో పంచాయతీ రాజ్ చాంబర్స్ రాష్ట్ర గౌరవ అధ్యక్షులు పుసులూరి నరేందర్

ఖమ్మం వుదయం బ్యూరో ఆగస్టు 23:

ఈనెల 25న ఖమ్మంలోని లకారం ట్యాంక్ బండ్ లేక్ యు క్లబ్ లో జరిగే తెలంగాణ పంచాయతీ రాజ్ ఛాంబర్ ఖమ్మం జిల్లా సర్పంచ్ ల చైతన్య సదస్సును జయప్రదం చేయాలని తెలంగాణ పంచాయతీ రాజ్ ఛాంబర్స్ రాష్ట్ర గౌరవ అధ్యక్షులు కుసులూరి నరేందర్ పిలుపునిచ్చారు. ఖమ్మం ప్రెస్ క్లబ్ లో ఆదివారం ఏర్పాటు చేసిన విలేఖరుల సమావేశంలో నరేందర్ మాట్లాడుతూ.. దేశం అభివృద్ధి చెందాలంటే తొలుత గ్రామాల అభివృద్ధి జరగాలని, గ్రామాలు శక్తివంతంగా స్వచ్ఛందంగా పచ్చదనంగా ఉంటేనే ఈ దేశం సుభిక్షంగా ఉంటుందని అన్నారు. 79 ఏండ్ల స్వాతంత్ర భారతదేశంలో స్థానిక సంస్థల గ్రామ పాలన రోజు రోజుకు దిగజారి పోతుందని ఆందోళన వ్యక్తం చేశారు. మాత్మ గాంధీ తన కళ్ళలను సహకారం చేసుకునేందుకు గ్రామాలను అభివృద్ధి చేసుకోవాల్సిన బాధ్యత ప్రభుత్వాలపై ఉందని అందుకు అవసరమైన నిధుల కేటాయింపులు సర్పంచ్ పాలనకు కేటాయింపులు చేయాలని కోరారు. చెక్కు పవర్ గ్రామ సర్పంచ్, గ్రామ కార్యదర్శికి ఉండాలని, 73, 74 రాజ్యాంగ సవరణ ద్వారా 243 జి లో ఆర్టికల్లోని 11వ షెడ్యూల్లో పొందుపరిచిన 29 అంశాలను పంచాయతీలకు బదిలీ చేయాలని డిమాండ్ చేశారు. బడ్జెట్లో 50 శాతం నిధులను గ్రామపంచాయతీలకు ఇవ్వాలని, కేంద్ర ప్రభుత్వం నిధులతో పాటు రాష్ట్ర ప్రభుత్వం నుండి రావాల్సిన రిజిస్ట్రేషన్లు, మైనింగ్, రాయాల్టీ ట్యాక్సీలు ఇతర రాబడులు గ్రామ పంచాయతీలకు వెంటనే విడుదల చేయాలని ఆయన డిమాండ్ చేశారు. సర్పంచుల అందరికీ గౌరవ వేతనం 30 వేలు ఇవ్వాలని కోరారు.రేపు ఖమ్మం లో మధ్యాహ్నం రెండు గంటలకు జరిగే జిల్లా సర్పంచుల చైతన్య సదస్సును జయప్రదం చేయాలని నరేందర్ విజ్ఞప్తి చేశారు. ఈ విలేకరుల సమావేశంలో జడ్పిటిసిల సంఘం రాష్ట్ర మాజీ అధ్యక్షులు బెల్లం శ్రీనివాస్, ఎంపీపీల సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు లోడిగా వెంకన్న యాదవ్ పాల్గొన్నారు.

ఆటో కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

రేపటి నుండి ఆటోల బంద్‌ను జయప్రదం చేయాలి

నల్లగొండ, జిల్లా వుదయం ప్రతినిధి ఆగస్టు 23:

నల్లగొండ పట్టణ కేంద్రంలో ఎన్‌జీ కళాశాల నుంచి భారీ ఆటో ర్యాలీ, సభ

ఆటో కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలను వెంటనే పరిష్కరించాలని, రేపు జరగనున్న ఆటోల బంద్‌ను కార్మికులు జయప్రదం చేయాలని IFTU, CITU, AITUC, BRTU సంఘాల ఆధ్వర్యంలో నల్లగొండ పట్టణంలో భారీ ఆటో ర్యాలీ, సభ నిర్వహించారు. ఈ సందర్భంగా నల్లగొండలోని ఎన్‌జీ కళాశాల నుంచి భారీ సంఖ్యలో ఆటోలతో ర్యాలీ నిర్వహించారు. అనంతరం సభ నిర్వహించి ఆటో కార్మికుల ప్రధాన డిమాండ్లను ప్రభుత్వం ముందు ఉంచారు.

ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ, ఆర్‌టీసీ రంగంలో ఈవీ ఆటోలను ప్రవేశపెట్టడం వల్ల సాంప్రదాయ ఆటో కార్మికుల జీవనోపాధి దెబ్బతింటోందని ఆందోళన వ్యక్తం చేశారు. ఆర్‌టీసీ రంగంలో ఈవీ ఆటోలను రద్దు చేయాలని డిమాండ్ చేశారు.అలాగే ఆటో కార్మికుల సంక్షేమం కోసం ప్రత్యేకంగా ఆటో కార్మికుల సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని,ప్రతి ఆటో కార్మికుడికి ప్రమాద బీమా సౌకర్యం కల్పించాలని డిమాండ్ చేశారు. ప్రమాదాలకు గురైన కార్మిక కుటుంబాలకు ప్రభుత్వం పూర్తి స్థాయిలో అండగా నిలవాలని కోరారు.ఏళ్ల తరబడి ఆటోలు నడుపుతూ జీవనం సాగిస్తున్న కార్మికులు వృద్ధాప్యంలో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, 50 సంవత్సరాలు దాటిన ఆటో కార్మికులకు నెలవారీ పింఛన్ అందించాలని డిమాండ్ చేశారు. ఆటో కార్మికుల న్యాయమైన డిమాండ్ల పరిష్కారం కోసం రేపు జరగనున్న ఆటోల బంద్‌ను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఆటో కార్మికులందరూ ఐక్యంగా బంద్‌లో పాల్గొని తమ ఐక్యతను చాటాలని నాయకులు కోరారు.

ఈ కార్యక్రమంలో IFTU,జిల్లా అధ్యక్షులు బి నర్సింహా, కార్యదర్శి బొమ్మిడి నగేష్,CITU, AITUC, BRTU, IFTU సంఘాల నాయకులు, ఏ ఐ టి సి నుండి లెనిన్ కేస్ రెడ్డి, సిఐటియు జిల్లా సహకార దర్శి అవుట రవీందర్, అద్దంకి నరసింహ, హనుమంతునాయక్, బి ఆర్ టి యుజిల్లా కార్యదర్శి గుర్రం వెంకటరెడ్డి, యాదయ్య, సల్మాన్, చాగంటి రాములు, పి యాదయ్య, కత్తుల చందు, రావుల వీరేష్, దాసరి నర్సింహా, ఆటో కార్మికులు, కార్మిక సంఘాల కార్యకర్తలు భారీ సంఖ్యలో పాల్గొన్నారు

14 వారాలుగా శ్రీరామ అష్టోత్తర పఠనం ఆశ్రమంలో శ్రీరామ ధ్వజ ప్రతిష్ఠాపన

నర్సంపేట వుదయం ప్రతినిధి ఆగస్టు 23.

మాతృభూమి చారిటబుల్ ట్రస్ట్ సంజీవని ఆశ్రమం ప్రాంగణంలోని ఆంజనేయ స్వామి దేవాలయం వద్ద గత 14 ఆదివారాలుగా నిర్వహించిన శ్రీరామ అష్టోత్తర పఠన కార్యక్రమం భక్తిశ్రద్ధలతో ముగిసింది. ఈ సందర్భంగా ఆశ్రమంలోని విద్యార్థులతో పాటు భక్తులందరితో శ్రీరామ అష్టోత్తరాన్ని పఠింపజేసి, రామనామ స్మరణతో ఆధ్యాత్మిక వాతావరణాన్ని నెలకొల్పారు.

శ్రీ గాదెపాక రాములు ఏర్పాటు చేసిన శ్రీరామ అష్టోత్తరాన్ని ఆశ్రమంలోని విద్యార్థులకు ప్రతి వారం ఎంతో శ్రమతో నేర్పించి, వారితో ఎంవి కృష్ణారావు పఠింపజేశారు. అలాగే గోవింద నామాలను కూడా విద్యార్థులకు నేర్పించి 14 వారాల పాటు కార్యక్రమాన్ని కొనసాగించారు. చివరి వారంలో శ్రీరామ ధ్వజాన్ని ప్రతిష్ఠించి కార్యక్రమాన్ని ఘనంగా ముగించారు. ఈ సందర్భంగా అంతా రామమయం కావాలని, ప్రతి ఒక్కరూ శ్రీరాముని స్మరించుకుంటూ ధర్మబద్ధమైన జీవనాన్ని కొనసాగించాలని నిర్వాహకులు ఆకాంక్షించారు. శ్రీరామ అష్టోత్తరం, గోవింద నామాలను 14 వారాల పాటు విద్యార్థులకు నేర్పించి కార్యక్రమాన్ని విజయవంతం చేయడంలో విశేష కృషి చేసిన వికాస్ తరంగిణి అధ్యక్షులు మెదతాటి వెంకటకృష్ణరావు సేవలను ఆశ్రమ వ్యవస్థాపకులు అర్చనపల్లి వినోద్ మోహన్‌రావు కొనియాడారు.

విద్యార్థుల్లో భక్తిభావం, ఆధ్యాత్మిక చింతన పెంపొందించేందుకు ఇటువంటి కార్యక్రమాలు ఎంతో ఉపయోగపడతాయని ఆయన పేర్కొన్నారు. కార్యక్రమంలో ఆశ్రమ నిర్వాహకులు రమాదేవి, మౌనిక తదితరులు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

ఘనంగా రోజా ఎంటర్ప్రైజెస్ ప్రారంభం సరసమైన హోల్‌సేల్ ధరలే లక్ష్యం

రోజా ఎంటర్ప్రైజెస్ ప్రొప్రైటర్ మూడు ప్రసాద్

పర్వతగిరి, ఆగస్టు 23 (వుదయం ప్రతినిధి):

పర్వతగిరి మండల కేంద్రంలో రోజా ఎంటర్ప్రైజెస్ నూతన షాపును ఆదివారం ఘనంగా ప్రారంభించారు. మండల ప్రజలకు అవసరమైన ప్లంబింగ్,ఎలక్ట్రికల్, శానిటరీ వస్తువులను సరసమైన హోల్‌సేల్ ధరలకు అందుబాటులోకి తీసుకురావడమే ప్రధాన లక్ష్యంగా ఈ సంస్థను ఏర్పాటు చేసినట్లు నిర్వాహకులు తెలిపారు. రోజా ఎంటర్ప్రైజెస్‌ను పర్వతగిరి సర్పంచ్ చిదురు శంకర్, మాజీ సర్పంచ్ గోనె సంపత్ చేతుల మీదుగా ప్రారంభించారు. ఈ సందర్భంగా షాపు నిర్వాహకులకు వారు శుభాకాంక్షలు తెలియజేస్తూ, మండల ప్రజలకు నాణ్యమైన వస్తువులను అందుబాటులో ఉంచడం అభినందనీయమన్నారు.ఈ కార్యక్రమానికి పలువురు నాయకులు, బంధువులు, కస్టమర్లు, వ్యాపార ప్రముఖులు హాజరై రోజా ఎంటర్ప్రైజెస్ యాజమాన్యానికి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా రోజా ఎంటర్ప్రైజెస్ ప్రొప్రైటర్ మూడు ప్రసాద్ మాట్లాడుతూ.. పర్వతగిరి మండల ప్రజలకు అందుబాటులో ఉంటూ, అవసరమైన ప్లంబింగ్, ఎలక్ట్రికల్, శానిటరీ వస్తువులను నాణ్యతతో పాటు సరసమైన హోల్‌సేల్ ధరలకు అందించడమే తన ముఖ్య ఉద్దేశమని తెలిపారు. మండల ప్రజలు తన వ్యాపారాన్ని ఆదరించి, ఆశీర్వదించాలని కోరారు.తన షాపు ప్రారంభోత్సవ కార్యక్రమానికి హాజరై శుభాకాంక్షలు తెలిపిన ప్రతి ఒక్కరికీ మూడు ప్రసాద్ ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. మండల ప్రజల ఆదరణతో రోజా ఎంటర్ప్రైజెస్‌ను మరింత అభివృద్ధి చేసి, వినియోగదారులకు మెరుగైన సేవలు అందిస్తామని ఆయన పేర్కొన్నారు.

ఘనంగా ముత్యాలమ్మ బోనాల పండుగ

గ్రామ దేవతల ఆరాధన మహిళల ఆత్మగౌరవానికి ప్రతీక : ఎమ్మెల్యే పద్మావతి

కోదాడ ఆగస్టు 23 (వుదయం) కోదాడ:

పట్టణంలో ముత్యాలమ్మ తల్లి బోనాల పండుగను భక్తిశ్రద్ధలతో, సంప్రదాయబద్ధంగా ఘనంగా నిర్వహించారు. గ్రామ దేవతలను ఆరాధించడం తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాల్లో అంతర్భాగమని ఎమ్మెల్యే పద్మావతి అన్నారు. తరతరాలుగా వస్తున్న ఆచారాలను కాపాడుకోవడం ప్రతి ఒక్కరి బాధ్యత అన్నారు.మహిళలు భక్తిశ్రద్ధలతో బోనాలు ఎత్తుకుని అమ్మవారిని కొలవడం తెలంగాణ సంస్కృతికి ప్రత్యేకత అని, గ్రామాలను కంటికి రెప్పలా కాపాడేది గ్రామ దేవతలేనని పేర్కొన్నారు. ప్రజలకు సుఖశాంతులు, సుభిక్షాలు ప్రసాదించాలని ముత్యాలమ్మ తల్లిని వేడుకున్నారు. పండుగ సందర్భంగా ఎడ్లబండ్లను ప్రత్యేకంగా ముస్తాబు చేసి ఊరేగింపులో పాల్గొనడం ద్వారా గ్రామీణ సంస్కృతి, సంప్రదాయాలను కాపాడుతున్న మున్సిపల్ చైర్మన్ ఎర్నేని కుసుమ వెంకట్ రత్నం బాబును ఎమ్మెల్యే పద్మావతి అభినందించారు. అనంతరం ఎమ్మెల్యే పద్మావతితో కలిసి మున్సిపల్ చైర్మన్ బోనం ఎత్తుకుని అమ్మవారిని దర్శించుకున్నారు. మహిళలు, యువతులు సంప్రదాయ వస్త్రధారణలో బోనాలు సమర్పించగా, భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించి మొక్కులు చెల్లించుకున్నారు. ఆలయ పరిసరాలు భక్తులతో కిక్కిరిసిపోయాయి. పట్టణంలో ఆధ్యాత్మిక వాతావరణం నెలకొంది.కార్యక్రమంలో మాజీ సర్పంచ్ ఎర్నేని వెంకట్ రత్నం బాబు, వైస్ చైర్మన్ మల్లీశ్వరి, కౌన్సిలర్ తోట జ్యోతి శ్రీనివాస్, కాంగ్రెస్ నాయకులు రావెళ్ల కృష్ణారావు పాల్గొన్నారు.

ఒక ఎమ్మెల్యే.. పై ..!..100 కుట్రలు..!

పద్మవ్యూహాన్ని ఛేదిస్తున్న మట్టా దంపతులు
సత్తుపల్లి నియోజకవర్గంలో కుట్రలపై అభివృద్ధే అస్త్రంగా పోరాటం!

కల్లూరు,ఆగస్టు 23 (వుదయం ప్రతినిధి)

సత్తుపల్లి రాజకీయాలు రోజుకో రంగు మారుతున్నాయి. ప్రజాస్వామ్య విలువలకు పాతర వేస్తూ, స్వార్థ రాజకీయాలకు పెద్దపీట వేస్తున్న ప్రస్తుత తరుణంలో సత్తుపల్లి నియోజకవర్గ శాసనసభ్యురాలు డాక్టర్ మట్టా రాగమయి దయానంద్ చుట్టూ జరుగుతున్న రాజకీయ చదరంగం ఇప్పుడు నియోజకవర్గంలో తీవ్ర చర్చనీయాంశంగా మారింది. అడుగడుగునా ఎదురవుతున్న 100 కుట్రలను ఎదురొడ్డి, అభివృద్ధి అజెండాతో మట్టా దంపతులు ముందుకు సాగుతున్న తీరు ప్రజల మన్ననలు పొందుతోంది.

రంగులు మారుతున్న సమీకరణాలు కుట్రల వలయం!

సత్తుపల్లి నియోజకవర్గంలో ఎమ్మెల్యేను ఒంటరిని చేయాలని అనేక ప్రయత్నాలు జరుగుతున్నాయి. ఒకవైపు ప్రతిపక్షాలు కులాల వారీగా ప్రజలను ఎమ్మెల్యేకు దూరం చేయాలని చూస్తుంటే, మరోవైపు కాంగ్రెస్ పార్టీలోని కొందరు నాయకులు అసమ్మతిని ప్రోత్సహిస్తూ రాజకీయ విధ్వంసానికి తెరతీస్తున్నారు. అంతా కుమ్మక్కై, పైకి మాత్రం ఎమ్మెల్యే దగ్గర మంచి వాళ్ళ లాగా నటిస్తూ వెన్నుపోటు రాజకీయాలకు పాల్పడుతున్నారు. డబ్బే ప్రధానంగా రాజకీయ సిద్ధాంతాలను గాలికి వదిలేసి, తమకు లబ్ధి చేకూరకపోతే అవినీతి రహిత పాలన అందిస్తున్న ఎమ్మెల్యే మట్ట దంపతులను ప్రభుత్వం పైనా తిరుగుబాటు చేసేందుకు కొందరు నాయకులు, కార్యకర్తలు సిద్ధమయ్యారు. వీరికి తోడు అడుగడుగునా లంచగొండితనంతో వ్యవస్థను భ్రష్టు పట్టిస్తున్న అధికారుల తీరు నియోజకవర్గంలో పరిస్థితులను మరింత ప్రతికూలంగా మార్చింది.

ఎమ్మెల్యేకు కవచంలా డాక్టర్ మట్టా దయానంద్ విజయ్ కుమార్

తన రెండున్నర ఏళ్ల పరిపాలనలో సొంత మనుషులతోనే అత్యంత పోరాడి నెగ్గుకొస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ మట్టా రాగమయికి కొండంత ధైర్యంగా నిలుస్తున్నారు డాక్టర్ మట్టా దయానంద్ విజయ్ కుమార్. అసమ్మతి నాయకులు, ప్రతిపక్షాలు పన్నుతున్న 100 కుట్రలను ఆయన తన పదునైన రాజకీయ వ్యూహాలతో ఎప్పటికప్పుడు తిప్పికొడుతున్నారు. ఎమ్మెల్యేకు నీడలా ఉంటూ, ఆమెను ఈ రాజకీయ పద్మవ్యూహంలో చిక్కుకోకుండా నిరంతరం ప్రజల వైపే నడిపిస్తున్నారు.ప్రతిపక్షాలు విసురుతున్న 100 తూటాల లాంటి సమస్యల వలయాన్ని ఛేదిస్తూ, వారి కుతంత్రాలకు దీటైన సమాధానం చెబుతున్నారు.

సంక్షేమం, అభివృద్ధే మా విధానం!

రాజకీయ విలువలను పాతిపెడుతూ, ప్రభుత్వ విధానాలను మంటగలుపుతున్న వారికి ఎమ్మెల్యే డాక్టర్ మట్టా దంపతులు విశ్వసనీయత, మానవతా విలువలు, నిరంతరం ప్రజాసేవ తోనే సమాధానం చెబుతున్నారు. పరిస్థితులు ఎంత ప్రతికూలంగా ఉన్నా, వాటిని ప్రజలకు అనుకూలంగా మారుస్తున్నారు. "ప్రజలకు మంచి చేయటం, నియోజకవర్గ అభివృద్ధి, సంక్షేమమే మా విధానం" అని బలంగా చాటి చెబుతున్నారు.

సత్తుపల్లి నియోజకవర్గ అభివృద్ధి కోసం రాష్ట్ర ప్రభుత్వ పెద్దలతో సైతం పోరాడి నిధులు తీసుకొస్తున్నారు. రాజకీయ కుట్రలను పక్కనపెట్టి, ప్రజా సమస్యల పరిష్కారమే ధ్యేయంగా ముందుకు వెళ్తున్నారు. ఒకవైపు నాయకుల అసమ్మతి, మరోవైపు కుట్రలు జరుగుతున్నా ఏమాత్రం వెనక్కి తగ్గకుండా, నియోజకవర్గంలో అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను పరుగులు పెట్టిస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ మట్టా దంపతుల పని తీరుపై సత్తుపల్లి ప్రజలు ప్రశంసల జల్లు కురిపిస్తున్నారు.

నేడు ప్రజావాణి కార్యక్రమం

– జిల్లా కలెక్టరేట్, ఆర్డీవో, తహసిల్దార్ కార్యాలయాల్లో ప్రజావాణి
వినతుల స్వీకరణ

హనుమకొండ, ఆగస్టు 23 (వుదయం ప్రతినిధి) :

ప్రజా సమస్యల పరిష్కారానికి ప్రజావాణి కార్యక్రమాన్ని సోమవారం నిర్వహిస్తున్నట్లు హనుమకొండ జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు.

హనుమకొండ జిల్లా కలెక్టరేట్ లోని కాన్ఫరెన్స్ హాలులో, హనుమకొండ పరకాల ఆర్డీవో కార్యాలయాలు, మండల కార్యాలయాల్లో ప్రజావాణి కార్యక్రమాన్ని నిర్వహించి ప్రజల నుండి అర్జీలను స్వీకరించి వాటి పరిష్కారానికి చర్యలు చేపట్టనున్నట్లు పేర్కొన్నారు. జిల్లా కలెక్టరేట్, ఆర్డీవో, మండల కార్యాలయాల్లో నిర్వహించే ప్రజావాణి కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని జిల్లా ప్రజలకు కలెక్టర్ ప్రకటనలో తెలియజేశారు.

టియుడబ్ల్యూజే రాష్ట్ర అధ్యక్షుల మాతృమూర్తి మృతిపట్ల జర్నలిస్టుల సంతాపం

వరంగల్, ఆగస్టు 23 (వుదయం ప్రతినిధి):

తెలంగాణ రాష్ట్ర వర్కింగ్ జర్నలిస్టుల సంఘం (TUWJ IJU) రాష్ట్ర అధ్యక్షులు కె. విరహత్ అలీ మాతృమూర్తి బాషారత్ ఉన్నిసా బేగం అనారోగ్యంతో గజ్వేల్‌లోని తమ నివాసంలో కన్నుమూశారు.

ఈ విషయం తెలుసుకున్న యూనియన్ రాష్ట్ర నాయకులు పిన్నా శివకుమార్, వరంగల్ జిల్లా అధ్యక్షులు శ్రీరాం రామచందర్, ప్రధాన కార్యదర్శి మట్టా దుర్గాప్రసాద్, సీనియర్ నాయకులు నార్లగిరి యాదగిరి తదితరులు విరహత్ అలీ కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు.బాషారత్ ఉన్నిసా బేగం ఆత్మకు శాంతి చేకూరాలని, వారి కుటుంబ సభ్యులకు ఈ దుఃఖాన్ని తట్టుకునే మనోధైర్యాన్ని భగవంతుడు ప్రసాదించాలని ఈ సందర్భంగా వారు ప్రార్థించారు.

ఎక్సైజ్ స్టేషన్‌లో వాహనాల బహిరంగ వేలం

ఎక్సైజ్ సీఐ పి. తాతాజీ.

పరకాల, ఆగస్టు 23 (వుదయం ప్రతినిధి):

వివిధ నేరాలకు సంబంధించి ఎక్సైజ్ అధికారులు స్వాధీనం చేసుకున్న వాహనాలను ఈ నెల 25న ఉదయం 11 గంటలకు పరకాల ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ స్టేషన్‌లో బహిరంగ వేలం నిర్వహించనున్నట్లు ఎక్సైజ్ సీఐ పి. తాతాజీ తెలిపారు.

.వరంగల్ రూరల్ జిల్లా ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ అధికారి ఆదేశాల మేరకు ఈ వేలం ప్రక్రియ చేపడుతున్నట్లు ఆయన పేర్కొన్నారు. వేలంలో పాల్గొనదలచిన ఆసక్తి ఉన్న వ్యక్తులు పరకాల ఎక్సైజ్ స్టేషన్‌ను సంప్రదించి, సంబంధిత వాహనం నిర్ణయించిన అప్‌సెట్ ధరలో 50 శాతం మొత్తాన్ని డిపాజిట్‌గా చెల్లించి వేలంలో పాల్గొనవచ్చని తెలిపారు.

వేలం ప్రక్రియలో ఆసక్తి ఉన్న వారు నిర్ణీత సమయానికి పరకాల ఎక్సైజ్ స్టేషన్‌కు హాజరై నిబంధనల మేరకు పాల్గొనాలని సీఐ తాతాజీ సూచించారు.

కార్యకర్తకు అండగా ఫౌండేషన్ చైర్మన్ శ్రీనివాస్ రెడ్డి

రాయపర్తి, ఆగస్టు 23 (వుదయంప్రతినిధి):

మండల కేంద్రానికి చెందిన బీఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు బల్లెం యాదగిరి ఇటీవల కుడికాలుకు గాయమై ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స పొంది ఇంటి వద్ద విశ్రాంతి తీసుకుంటున్నారు.విషయం తెలుసుకున్న ఎస్ఆర్ఆర్ ఫౌండేషన్ చైర్మన్, బీఆర్ఎస్ పార్టీ మండల సమన్వయకర్త పరుపాటి శ్రీనివాస్ రెడ్డి ఆదివారం హుటాహుటిన ఆయన నివాసానికి వెళ్లి పరామర్శించారు.యాదగిరి ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఎస్ఆర్ఆర్ ఫౌండేషన్ తరపున రూ.3,000 ఆర్థిక సాయాన్ని అందజేశారు. పార్టీ కార్యకర్తలకు ఎల్లప్పుడూ అండగా ఉంటామని, కష్టకాలంలో ఆదుకుంటామని ఈ సందర్భంగా ఆయన భరోసా ఇచ్చారు.

ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఎస్టీ యూనియన్ ఉపాధ్యక్షుడు సురేందర్ రాథోడ్ నాయక్, రాయపర్తి మండల పార్టీ నాయకులు లేతకుల రంగారెడ్డి, మాజీ సర్పంచ్ గారే నర్సయ్య, మండల నాయకులు గాదె రవీందర్ రెడ్డి, చందు రాము యాదవ్, ఉబ్బని కుమార్, స్వామి, మధు తదితరులు పాల్గొన్నారు.

బోనస్ డబ్బుల కోసం రైతులు ఆన్‌లైన్ లో నమోదు చేసుకోవాలి

మహాదేవపూర్: ఆగస్టు 23(వుదయం ప్రతినిధి)

ఈ వానాకాలం 2026 లో సన్న రకం వరి సాగు చేస్తున్న రైతులు ప్రభుత్వం అందించే బోనస్

పొందాలంటే తప్పనిసరిగా ఆన్‌లైన్‌లో నమోదు చేసుకోవాలి అని వ్యవసాయ శాఖ మహాదేవపూర్ మండల శ్రీజ ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఏడు రకాల సన్న రకం వరి సాగు చేసే రైతులు తాము విత్తనాలు కొనుగోలు చేసిన డీలర్‌ను సంప్రదించి పట్టా పాస్ బుక్, మొబైల్ నెంబర్ వివరాలు అందించి ఈ ప్రక్రియను పూర్తి చేసుకోవాలి అని తెలిపారు సెప్టెంబర్ 1వ తేదీ లోపు రైతులు అందరు ఈ ప్రక్రియ పూర్తి చేసుకోవాల్సిందిగా తెలిపారు.

లక్ష్మీపూర్ అర్ధరాత్రి దొంగతనం

తాళం పగలగొట్టి మూడు లక్షల నగదు ఆపహరణ

మానుకోండూర్ ఆగస్టు23 వుదయం ప్రతినిధి):

మానుకోండూర్ మండలం లక్ష్మీపూర్ గ్రామానికి చెందిన రాపాక లక్ష్మణ్ కు చెందిన తాళం వేసిన ఇంట్లో తాళం పగలగొట్టి ఇంట్లోకి చేరబడి తులం బంగారం, మూడు తులాల వెండి, బ్యాండ్ వస్తువులు మరియు డీజే కు సంబంధించిన వస్తువులు, మరియు రాగి ఇత్తడి వస్తువులు సుమారుగా 3 లక్షల విలువైన వస్తువులు దొంగతనం చేసి పరారైన దుండగులు ఇట్టి విషయంపై మానకొండూరు పోలీస్ స్టేషన్లో రాపాక ప్రవీణ్ ఫిర్య

తప్పిపోయిన చిన్నారిని తల్లిదండ్రులకు అప్పగించిన మేడిపల్లి పోలీసులు

మేడిపల్లి వుదయం ప్రతినిధి ఆగస్టు 23.

తప్పిపోయిన చిన్నారిని మేడిపల్లి సిఐ జలంధర్ రెడ్డి సమక్షంలో తల్లిదండ్రులకు అప్పగించిన సంఘటన మేడిపల్లి పోలీస్ స్టేషన్ లో ఆదివారం చోటుచేసుకుంది, ఈ సందర్భంగా మేడిపల్లి సిఐ జలంధర్ రెడ్డి మాట్లాడుతూ..

యాదగిరిగుట్ట డిపో కి చెందినటువంటి ఆర్టీసీ డ్రైవర్, గుర్తుతెలియని చిన్నారి ఆర్టీసీ బస్సులో ప్రయాణిస్తుండగా ఆయొక్క చిన్నారిని మేడిపల్లి పోలీస్ స్టేషన్లో అప్పగించడం జరిగిందని,మేడిపల్లి పోలీసులు భువనగిరి పోలీసులతో విచారించగా అట్టి చిన్నారి పేరు శివరాణి(7) , గచ్చిబౌలి

ప్రాంతానికి చెందిన చిన్నారిగా గుర్తించి, తన యొక్క కుటుంబ సభ్యులతో స్వర్ణ గిరి గుడికి వచ్చి అక్కడి నుండి ఎవరికి చెప్పకుండా ఆర్టీసీ బస్సు ఎక్కిందని, చిన్నారి తల్లి తండ్రుల ద్వారా సమాచారం తెలుసుకొని వాళ్ళ కుటుంబ సభ్యులకు అప్పగించడం జరిగిందిని మేడిపల్లి సిఐ జలంధర్ రెడ్డి తెలిపారు.

నూతన గృహప్రవేశ వేడుకల్లో జగిత్యాల ఎమ్మెల్యే సంజయ్ కృష్ణారావు చైర్పర్సన్ వసంత

కోరుట్ల ఆగస్టు 23 (వుదయం ప్రతినిధి) కోరుట్ల పట్టణ భీమునిదుబ్బ ప్రాంతంలో సీనియర్ పాత్రికేయుడు సిటీ కేబుల్ రిపోర్టర్ కటుకం గణేష్ చిన్న కుమారుడు కటుకం కిరణ్ బాబు అన్నపూర్ణ దంపతులు నూతనంగా నిర్మించిన గృహప్రవేశ వేడుకలు ఆదివారం నిర్వహించగా ఇట్టి గృహప్రవేశ వేడుకల్లో జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు గాజంగి నందయ్య కాంగ్రెస్ పార్టీ సీనియర్ రాష్ట్ర నాయకులు జువ్వాడి కృష్ణారావు మున్సిపల్ చైర్ పర్సన్ తిరుమల వసంత గంగాధర్ లతో పాల్గొని శుభాకాంక్షలు తెలియజేసిన జగిత్యాల నియోజకవర్గ శాసనసభ్యులు డాక్టర్ యం సంజయ్ కుమార్ ఈ కార్యక్రమంలో కోరుట్ల పట్టణ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు తిరుమల గంగాధర్ మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు పన్నాల అంజిరెడ్డి మాజీ అధ్యక్షులు కొంతం రాజం నాయకులు బెజ్జారపు శ్రీనివాస్ సీనియర్ పాత్రికేయులు గంగుల రాంగోపాల్ రాజేందర్ కటుకం గణేష్ కుటుంబ సభ్యులు తదితరులు పాల్గొన్నారు

శ్రీ రామలింగేశ్వర స్వామి, పార్వతీదేవి అమ్మవార్ల ఉపాలయాల ప్రతిష్ఠా మహోత్సవం ఘనంగా ముగింపు

భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఆగస్టు 23 (వుదయం ప్రతినిధి) దేవాదాయ ధర్మాదాయ శాఖ ఆధ్వర్యంలో భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కొత్తగూడెం పట్టణంలోని శ్రీ పాండురంగ భజన మందిరం ప్రాంగణంలో శ్రీ రామలింగేశ్వర స్వామివారు, శ్రీ పార్వతీదేవి అమ్మవార్ల ఉపాలయాల ప్రతిష్ఠా మహోత్సవాలు ఐదు రోజులపాటు పాంచాహ్నిక దీక్షాపూర్వకంగా వైభవంగా నిర్వహించారు. ఆదివారం ఐదవ రోజు, ఆఖరి రోజున ఉదయం 6 గంటలకు మంగళ వాయిద్యాలతో కార్యక్రమాలు ప్రారంభమయ్యాయి. అనంతరం ఉదయం 8.30 గంటల నుంచి ప్రాతఃకాల అర్చనలు, అభిషేకాలు, హోమాది కార్యక్రమాలను శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఉదయం 10.30 గంటలకు మూర్తుల స్థానములు, గర్తన్యాసం, బీజ, ఓషధి, రత్నన్యాస కార్యక్రమాలు చేపట్టారు.

ఉదయం 11.25 గంటలకు మూలా నక్షత్ర యుక్త తులా లగ్నంలో యంత్ర, విగ్రహ స్థిర ప్రతిష్ఠ కార్యక్రమాన్ని అత్యంత వైభవంగా నిర్వహించారు. మధ్యాహ్నం 12 గంటలకు భక్తులకు అన్నప్రసాద వితరణ చేపట్టారు. అనంతరం మధ్యాహ్నం 1 గంటకు శాంతి కల్యాణం, బలిహరణ, ధేను దర్శనం కార్యక్రమాలు నిర్వహించి భక్తులకు స్వామివారి దర్శనం, ఆశీర్వచనం కల్పించారు. ఈ ప్రతిష్ఠా మహోత్సవ కార్యక్రమాలను బ్రహ్మశ్రీ శ్రీ చేబ్రోలు సుబ్రహ్మణ్య శర్మ ఆధ్వర్యంలోని వేద పండితులు, అర్చక బృందం శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఐదు రోజులపాటు జరిగిన ఈ మహోత్సవాల్లో భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని స్వామివారి ఆశీస్సులు పొందారు. కార్యక్రమాల్లో ఆలయ కార్యనిర్వహణాధికారి శ్రీమతి కె. సులోచన, ఆలయ అర్చకులు, సిబ్బంది, ఆలయ నిర్మాణ దాతలు, భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

మహేశ్వరంలో నషా ముక్త భారత్ అభియాన్ పై పీఐబీ వార్తా మీడియా వర్క్‌షాప్

ఆగస్టు 25న జరిగే కార్యక్రమానికి స్థానిక విలేకరులందరికీ ఆహ్వానం

హైదరాబాద్, 23 ఆగస్టు 2026: మాదక ద్రవ్యాలు కలిగించే దుష్ప్రభావాలపై ప్రజలను చైతన్యవంతులను చేయడంలో భాగంగా– పత్రికా విలేకరుల అవగాహన కోసం రంగారెడ్డి జిల్లా మహేశ్వరంలో ఈ నెల 25వ (ఆగస్టు 25, 2026) తేదీన ఒక వర్క్ షాపును నిర్వహిస్తున్నట్లు హైదరాబాద్– పత్రికా సమాచార కార్యాలయం ఒక ప్రకటనలో తెలిపింది. మహేశ్వరంలోని ఎంపీడీఓ కార్యాలయంలోని సమావేశ మందిరంలో ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తారు. మాదక ద్రవ్య రహిత సమాజాన్ని రూపొందించడంలో భాగంగా మాదక ద్రవ్యాల వల్ల కలిగే దుష్ప్రభావాలను ప్రజల్లోకి ఎలా తీసుకుపోవాలన్న అంశంపై విలేకరులకు అవగాహన కల్పిస్తారు. మాదక ద్రవ్యాలు సమాజంపై ఎలాంటి చెడు ప్రభావాన్ని చూపిస్తున్నాయన్న అంశాన్ని ఐపీఎస్ అధికారి శ్రీ కె.నారాయణ రెడ్డి (మహేశ్వరం జోన్ డీసీపీ) విలేకరులకు వివరించడంతోపాటు, ఈ అంశంపై వచ్చే వార్తలకు పత్రికల్లో ఇవ్వాల్సిన ప్రాధాన్యాన్నీ, ఈ సవాలును ఎదుర్కోవడంలో విలేకరులు పోషించాల్సిన పాత్రనూ తెలియజేస్తారు.

విభిన్న సంస్కృతులకు నిలయం పటాన్చెరు

- ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి
- ఆర్ సి పురంలో ఘనంగా ఓనం వేడుకలు

రామచంద్రాపురం ఆగస్టు 23 (వుదయం ప్రతినిధి) :విభిన్న సంస్కృతులకు నిలయం పటాన్చెరు నియోజకవర్గమని స్థానిక శాసనసభ్యులు గూడెం మహిపాల్ రెడ్డి అన్నారు. రామచంద్రపురం డివిజన్ పరిధిలోని ఎస్ ఎన్ గార్డెన్స్ లో కేరళ సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఓనం వేడుకలకు ఎమ్మెల్యే జిఎంఆర్ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మినీ ఇండియా గా పేరుందిన పటాన్చెరు నియోజకవర్గంలోని అన్ని వర్గాల అభివృద్ధి సంక్షేమానికి పాటుపడుతున్నామని తెలిపారు. కుల మతాలకు అతీతంగా అందరి పండుగలను సంప్రదాయాలను గౌరవిస్తూ కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. అర్హులైన ప్రతి ఒక్కరికి సంక్షేమ పథకాలు అందిస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ పార్టీ కో–ఆర్డినేటర్ ఆదర్శ్ రెడ్డి, మాజీ కార్పొరేటర్లు అంజయ్య, మెట్టు కుమార్ యాదవ్, పరమేష్ యాదవ్, విశాల్, సంఘం సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

నల్ల పోచమ్మ తల్లి, ఎల్లమ్మ తల్లి బోనాల వేడుకలకు హాజరైన పటాన్‌చెరు నియోజకవర్గ బీఆర్ఎస్ పార్టీ ఇన్‌చార్జ్ ఆదర్శ్ రెడ్డి

రామచంద్రపురం ఆగస్టు 23 (వుదయం ప్రతినిధి) :పటాన్‌చెరు నియోజకవర్గం పరిధిలోని భారతి నగర్ డివిజన్ బాంబే కాలనీ లో గల శ్రీ శ్రీ శ్రీ నల్ల పోచమ్మ తల్లి, ఎల్లమ్మ తల్లి ఆలయ కమిటీ ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన బోనాల వేడుకల్లో పటాన్‌చెరు నియోజకవర్గ బీఆర్ఎస్ పార్టీ ఇన్‌చార్జ్ శ్రీ ఆదర్శ్ రెడ్డి గారు, ఎమ్మెల్యే శ్రీ గూడెం మహిపాల్ రెడ్డి గారు పాల్గొని అమ్మవార్లను దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు.

అనంతరం మాజీ వార్డు సభ్యులు శ్రీ గిరి గారు ఏర్పాటు చేసిన పాలారం బండిలో పాల్గొని భక్తులతో కలిసి బోనాల వేడుకల్లో పాల్గొన్నారు.

ఈ సందర్భంగా అమ్మవార్ల ఆశీస్సులతో ప్రజలందరూ సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో ఉండాలని వారు ఆకాంక్షించారు. బోనాల పండుగ సందర్భంగా భక్తులకు, స్థానిక ప్రజలకు శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో రామచంద్రాపురం మాజీ కార్పొరేటర్ శ్రీ తొంట అంజయ్య గారు, పటాన్‌చెరు మాజీ కార్పొరేటర్ శ్రీ మెట్టు కుమార్ యాదవ్ గారు, బీఆర్ఎస్ సర్కిల్ మాజీ అధ్యక్షులు శ్రీ పరమేష్ యాదవ్ గారు, బీఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు శ్రీ కుమార్ గౌడ్ గారు, శ్రీ జగన్నాథ్ రెడ్డి గారు, ఆలయ కమిటీ సభ్యులు నర్సింహ, సతీష్, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

కాలేశ్వరం ప్రాజెక్టు నాసిరకంగా నిర్మించడానికి కల్వకుంట్ల కుటుంబ అవినీతి కారణం...

కోరుట్ల ఎమ్మెల్యే సంజయ్ కుటుంబం అవినీతిపై నిప్పులు జరిగిన జువ్వాడి కృష్ణారావు

కోరుట్ల ఆగస్టు 23 (వుదయం ప్రతినిధి) కాలేశ్వరం ప్రాజెక్ట్ నాసిరకంగా నిర్మించడానికి కల్వకుంట్ల కుటుంబ అవినీతి ప్రధాన కారణమని కోరుట్ల ఎమ్మెల్యే కల్వకుంట్ల సంజయ్ ని కాంగ్రెస్ పార్టీ సీనియర్ రాష్ట్ర నాయకులు జువ్వాడి కృష్ణారావు నిలదీశారు ఆదివారం కోరుట్ల నియోజకవర్గ కేంద్రమైన కోరుట్ల పట్టణంలోని జువ్వాడి కృష్ణారావు స్వగృహం జువ్వాడి భవన్లో విలేకరుల సమావేశం నిర్వహించారు ఈ సందర్భంగా జువారి కృష్ణారావు మాట్లాడుతూ కాళేశ్వరం ప్రాజెక్టులోని పిల్లర్లు కృంగిపోయాయని ఇందులో నీరు నిలువ చేస్తే ప్రమాదమని నేషనల్ డ్యామ్ సేఫ్టీ అథారిటీ (ఎన్ డి ఎస్ ఎ) ఇచ్చిన నివేదిక ఆధారంగా రాష్ట్ర ప్రభుత్వం కాలేశ్వరం ప్రాజెక్టులో నీటిని నిల్వ చేయలేదని నీటిని నిల్వ చేస్తే ప్రాజెక్టు కుప్పకూలుతుందని అందుకే నీటిని నిలువ చేయలేదన్నారు అదే సమయంలో గతంలో కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం హయాంలో నిర్మించిన ఎల్లంపల్లి శ్రీపాద సాగర్ ప్రాజెక్టు ద్వారా ఎన్టిపిసి జంట నగరాల తాగునీటి అవసరాల కోసం తెలంగాణకు ఎంతో ఉపయోగపడుతున్న ప్రాజెక్టు అని ఈ ప్రాజెక్టు ద్వారా దిగ్విజయంగా జలాలను పంపిస్తున్నట్లు తెలిపారు కోరుట్ల ఎమ్మెల్యే కల్వకుంట్ల సంజయ్ మేడిగడ్డ ప్రాజెక్టు గురించి మాట్లాడాలనుకోవడం వల్ల వారి కుటుంబం కాలేశ్వరం ప్రాజెక్టులో చేసిన అవినీతిని వాళ్లే ఒప్పుకున్నారన్నారు కాలేశ్వరం ప్రాజెక్టులో మీ కుటుంబం 100 కోట్ల రూపాయల కాంట్రాక్టు తీసుకొని బినామీల ద్వారా నాసిరకం పనిచేసే కాలేశ్వరం ప్రాజెక్టు అద్వాన స్థితికి చేరుకొని నీటి నిల్వ చేయకుండా తెలంగాణ ప్రజలకు కుచ్చుటోపి పెట్టినారన్నారు ప్రాజెక్టు నిర్మాణంలో కాంక్రీట్ నాణ్యత పరీక్షలు మాత్రమే చేసేటటువంటి సంస్థ 54శాతం మాత్రమే నాణ్యత ఉన్నదని ఇచ్చిన రిపోర్ట్ ఆధారంగా అవగాహన లేకుండా కాలేశ్వరం ప్రాజెక్టు ద్వారా నీటిని ఎత్తిపోయాలనే డిమాండ్ చేస్తున్నటువంటి కల్వకుంట్ల సంజయ్ కి అవినీతి ద్వారా ఏ విధంగా డబ్బు సంపాదించడం అనే విషయం తెలిసినంతగా ఇంకే విషయం మీద కూడా విషయపరిజ్ఞానం లేదని అర్థమవుతుందని కృష్ణారావు అన్నారు కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వ హయాంలో దేశానికి స్వాతంత్రం వచ్చిన తొలి రోజు నుండి నేటి వరకు నిర్మించిన ఏ ఒక్క ప్రాజెక్టు కూడా కూలిపోలేదని ఇది ప్రజల పట్ల మాకు మా పార్టీకి ఉన్న చిత్తశుద్ధి అన్నారు టిఆర్ఎస్ పార్టీ ప్రభుత్వం తెలంగాణ రాష్ట్రంలో అధికారంలో ఉన్న పది సంవత్సరాలలో నిర్మించిన ఒకే ఒక్క ప్రాజెక్టు కాలేశ్వరం ప్రాజెక్టు అని ఈ ప్రాజెక్టు ద్వారా లక్షణాధి కోట్ల రూపాయల అవినీతికి పాల్పడి వేలాది కోట్ల రూపాయలు అక్రమంగా సంపాదించి కల్వకుంట్ల కుటుంబం తరతరాలకు తరగని అక్రమ సంపాదన ప్రజలను దోసి కూడబెట్టుకున్నదని తెలంగాణ ప్రజలకు ముచ్చట పెట్టిందని జువ్వాడి కృష్ణారావు అన్నారు కోరుట్ల ఎమ్మెల్యే కుటుంబం కాలేశ్వరం ప్రాజెక్టులోని మేడిగడ్డలో బినామీల ద్వారా నాసిరకం నిర్మాణాలు చేయించి అక్రమంగా డబ్బు దోపిడీ చేసి ప్రాజెక్టు కూలిపోవడానికి దీనస్థితికి మీరే కారణమని అన్నారు కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం ఎల్లప్పుడు పేదల పక్షాన నిలబడుతుందన్నారు తెలంగాణ రాష్ట్రంలో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ పార్టీ ప్రజా ప్రభుత్వం ప్రజలకు రేషన్ దుకాణాల ద్వారా దేశంలో ఎక్కడా లేనివిధంగా సన్నబియాన్ని పంపిణీ చేస్తోందని మీ హయాంలో ఇచ్చినటువంటి బియ్యం ఎవరైనా తిన్నారా కానీ నేడు తెలంగాణ రాష్ట్ర ప్రధానికమందరు కూడా తినడానికి సన్నబియ్యం రాష్ట్ర ప్రభుత్వం ద్వారా సరఫరా చేస్తుందని అదేవిధంగా ఆనాడు ఉమ్మడి రాష్ట్రంలో రైతులకు ఉచిత విద్యుత్తు ఇచ్చింది కాంగ్రెస్ పార్టీని ఈరోజు రైతులతో పాటు ప్రతి పేదవారి ఇంటికి 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్ ఇస్తున్నామని టిఆర్ఎస్ పదేళ్ల పాలనలో ఒక్క నూతన రేషన్ కార్డును కూడా ఇవ్వలేదని నేడు కాంగ్రెస్ పార్టీ ప్రజా ప్రభుత్వం రాష్ట్రంలో ప్రజలందరికీ స్మార్ట్ రేషన్ కార్డులను కూడా అందజేస్తుందన్నారు మీ అవినీతి అవగాహన లేని విషయం బయటకు వస్తుందని రాద్ధాంతం చేస్తున్నారని కాలేశ్వరం ప్రాజెక్టు నుండి నీటిని ఎత్తిపోయారని ముఖ్యమంత్రిని విమర్శిస్తున్నారని ఇప్పటికైనా ముఖ్యమంత్రిని విమర్శించడం మానుకోవాలని కృష్ణారావు కోరారు అదే విధంగా తాను చేస్తున్న ఆరోపణకు కట్టుబడి ఉంటానని ఈ విషయంలో ఎక్కడా బహిరంగ చర్చ కైనా సిద్ధంగా ఉన్నానన్నారు అవినీతి ప్రజల సొమ్ము దోచుకోవడం ఖాదీ భూములు అమ్ముకోవడం తదితర వాటిలో మీకున్న అర్హత ఎవరికి లేదని దెప్పి పొడిచారు ఈ సమావేశంలో కోరుట్ల మున్సిపల్ వైస్ చైర్మన్ కోరుట్ల మండల కాంగ్రెస్ పార్టీ మాజీ అధ్యక్షులు కొంతం రాజం కోరుట్ల పట్టణ కాంగ్రెస్ పార్టీ ఉపాధ్యక్షులు ఎంఏ నయీమ్ కాంగ్రెస్ పార్టీ నాయకులు బెజ్జారపు శ్రీనివాస్ మసీద్ ముజ్బిత్ పిజర్ ఖయ్యూం చుమ్ము హర్షత్ తదితరులు పాల్గొన్నారు

లక్ష్మీపూర్ అర్ధరాత్రి దొంగతనం

తాళం పగలగొట్టి మూడు లక్షల నగదు అపహరణ

మానుకోండుర్ ఆగస్టు23 వుదయం (ప్రతినిధి): మానుకోండుర్ మండలం లక్ష్మీపూర్ గ్రామానికి చెందిన రాపాక లక్ష్మణ్ కు చెందిన తాళం వేసిన ఇంట్లో తాళం పగలగొట్టి ఇంట్లోకి చేరబడి తులం బంగారం, మూడు తులాల వెండి,బ్యాండ్ వస్తువులు మరియు డీజే కు సంబంధించిన వస్తువులు, మరియు రాగి ఇత్తడి వస్తువులు సుమారుగా 3 లక్షల విలువైన వస్తువులు దొంగతనం చేసి పరారైన దుండగులు ఇట్టి విషయంపై మానకొండూరు పోలీస్ స్టేషన్లో రాపాక ప్రవీణ్ ఫిర్యాదు చేశారు.

శాంతియుత వాతావరణంలో మిలాద్ ఉన్ నబీ జరుపుకోవాలి

– డీఎస్పీ బుర్రి శ్రీనివాస్

నాగర్‌కర్నూల్, ఆగస్టు 24 (వుదయం బ్యూరో): ముస్లింలు ఎంతో భక్తితో జరుపుకునే మహమ్మద్ ప్రవక్త జన్మదినం సందర్భంగా జరుపుకునే మిలాద్ ఉన్ నబీ పండుగను శాంతియుత వాతావరణంలో జరుపుకోవాలని నాగర్‌కర్నూల్ డీఎస్పీ బుర్రి శ్రీనివాస్ అన్నారు. ఆదివారం డీఎస్పీ కార్యాలయంలో మిలాద్ ఉన్ నబీ సందర్భంగా ముస్లిం మత పెద్దలతో పీస్ కమిటీ సమావేశం ఏర్పాటు చేశారు.

ఈ సందర్భంగా డీఎస్పీ మాట్లాడుతూ ప్రవక్త చూపిన మార్గాన్ని అనుసరిస్తూ శాంతియుత మార్గంలో పండుగను జరుపుకోవాలని సూచించారు. ఉద్రిక్తతలకు, కవ్వింపు చర్యలకు తావు లేకుండా వేడుకలు నిర్వహించాలని, ప్రతి ఒక్కరూ పోలీసులకు సహకరించాలని కోరారు. నిర్వహించే కార్యక్రమాలు, జులూస్ తదితర అంశాలను ముస్లిం పెద్దలను అడిగి తెలుసుకున్నారు.

కాంగ్రెస్ పార్టీ మైనార్టీ విభాగం జిల్లా అధ్యక్షుడు హబీబ్, మున్సిపల్ కౌన్సిలర్ మహమ్మద్ నిజాం తదితరులు మాట్లాడుతూ ఇస్లాం మతంలో డీజేకు తావు లేదని, భక్తి సందేశాలతో యాత్ర సాగుతుందని తెలిపారు. మంగళవారం రాత్రి జామా మసీద్ లో ఈద్ ఏ మిలాద్ ఉన్ నబీ కార్యక్రమాలు నిర్వహిస్తామని తెలిపారు.

ఈ కార్యక్రమంలో సీఐ అశోక్ రెడ్డి, ఎస్ఐ వెంకట్ రెడ్డి, ముస్లిం సంఘాల బాధ్యులు షేక్ యాకుబ్ బాబాజీర్, మహమ్మద్ సాదిక్ పాషా, మహమ్మద్ ఇబ్రహీం, మహమ్మద్ అలీమ్, జహీరుద్దీన్, ముస్లిం యువజన సంఘాల బాధ్యులు, వివిధ పార్టీల మైనార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

శ్రీ ఉమా మహేశ్వరాలాయాన్ని దర్శించుకున్న విజయ డెయిరీ ఎండి

అచ్చంపేటర,ఆగస్టు23: (వుదయం ప్రతినిధి)మండల పరిధిలో ని రంగాపూర్ శివారు శ్రీశైల ఉత్తర ద్వారంగా బాసిల్లుతున్న శ్రీ ఉమా మహేశ్వరాలయాన్ని రాష్ట్ర విజయ డెయిరీ ఎండీ (మేనేజింగ్ డైరెక్టర్), సినియర్ ఐఎఎస్ అధికారి కట్టా చంద్రశేఖర్ రెడ్డి ఆదివా రం దర్శించుకోని బందు మిత్రులతో ప్రత్యేక పూజలు నిర్వహించి తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. అనం తరం నిత్యాన్నదాన సత్రాన్ని సందర్శించి ఈవో శ్రీనివాస్ రావు కు విరాళం అందించారు. ఈ కార్యక్రమంలో ఆలయ సిబ్బంది పాల్గొన్నారు. కట్టా జనార్దన్ రెడ్డి నల్లమల వాసీ అచ్చంపేట నియోజకవర్గం ఉప్పునూంతల మండల వాసీ కావడం గమనార్హం.

డ్రగ్స్ వ్యతిరేక అవగాహన కార్యక్రమాల్లో రాష్ట్ర స్థాయిలో యాదాద్రి భువనగిరి పోలీసులకు 4వ స్థానం

యాదాద్రి భువనగిరి జిల్లా.యాదాద్రి భువనగిరి: డ్రగ్స్ వ్యతిరేక అవగాహన కార్యక్రమాలను సమర్థవంతంగా నిర్వహిస్తూ, యువతను మాదకద్రవ్యాల బారిన పడకుండా కాపాడేందుకు చేస్తున్న విశేష కృషికి గుర్తింపుగా యాదాద్రి భువనగిరి జిల్లా పోలీసులు రాష్ట్ర స్థాయిలో 4వ స్థానం సాధించారు. డ్రగ్స్ వినియోగం వల్ల కలిగే అనర్థాలు, మాదకద్రవ్యాల అక్రమ రవాణా మరియు వినియోగాన్ని అరికట్టే చర్యలపై జిల్లా వ్యాప్తంగా పోలీసుల ఆధ్వర్యంలో విస్తృతంగా అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. ముఖ్యంగా యువత, విద్యార్థులు మరియు సమాజంలోని బలహీన వర్గాలను లక్ష్యంగా చేసుకుని నిరంతరం అవగాహన కార్యక్రమాలు చేపడుతున్నారు. ఈ సందర్భంగా ఙ్రా యాదాద్రి భువనగిరి శ్రీ అక్షాన్ష్ యాదవ్ ఙ్రా జిల్లా పోలీసు అధికారులు, సిబ్బందిని అభినందించారు. డ్రగ్స్ వ్యతిరేక అవగాహన కార్యక్రమాలను మరింత బలోపేతం చేయడంలో నాయకత్వం వహిస్తూ విశేష కృషి చేసిన ఙ్రా శ్రీ రవీందర్ను ప్రత్యేకంగా అభినందించారు. అలాగే, డ్రగ్స్ వ్యతిరేక అవగాహన మరియు నివారణ చర్యల్లో ప్రశంసనీయమైన సేవలు అందించిన మోత్కూర్ ఞనూ శ్రీ వెంకటేశ్వర్లును అభినందించి ప్రశంసా పత్రాన్ని అందజేశారు. డ్రగ్స్ వ్యతిరేక అవగాహన మరియు నివారణలో చేసిన విశేష కృషికి గుర్తింపుగా జుఖస్త్రశ్రీవ ఖీశీతీఎవ ఇన్‌చార్జ్ ఞాఎఎ్అశీఖుశ్రీ ణ+ా శ్రీ సందీప్ శాండిల్య చేతుల మీదుగా ఙ్రా శ్రీ రవీందర్ మరియు మోత్కూర్ ఞనూ శ్రీ వెంకటేశ్వర్లు ప్రశంసా పత్రాలను అందుకున్నారు. జిల్లా పోలీసులు డ్రగ్స్ ముప్పును అరికట్టేందుకు అవగాహన, నివారణ, చట్టపరమైన చర్యలు మరియు ప్రజల భాగస్వామ్యానికి నిరంతరం ప్రాధాన్యత ఇస్తున్నారు. డ్రగ్స్ రహిత, సురక్షితమైన మరియు బలమైన సమాజ నిర్మాణం కోసం ప్రజలు కూడా పోలీసులకు సహకరించాలని కోరారు. "డ్రగ్స్‌కు నో చెప్పండి -- ఆరోగ్యకరమైన సమాజ నిర్మాణంలో భాగస్వాములు కండి" అనే సందేశంతో జిల్లా పోలీసులు తమ అవగాహన కార్యక్రమాలను మరింత విస్తృతంగా కొనసాగించనున్నారు.

నల్లగొండను సూపర్ స్మార్ట్ సిటీగా తీర్చిదిద్దడమే లక్ష్యం

రోడ్లు,భవనాలు, సినిమాటోగ్రఫీ శాఖల మంత్రి మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి

నల్గొండ జిల్లా , వుదయం వార్త ప్రతినిధి ఆగస్టు 23

నల్గొండ పట్టణంలోని నల్లగొండ క్లబ్‌లో రూ.2 కోట్లతో నూతనంగా నిర్మించిన గెస్ట్ రూమ్, కాన్ఫరెన్స్ హాల్ ను నగర మేయర్ బుర్రి చైతన్య శ్రీనివాస్ రెడ్డితో కలిసి ప్రారంభించారు.

రూ.1,400 కోట్లతో అభివృద్ధి పనులు, రూ.10 కోట్లతో త్వరలో లైబ్రరీ పనులకు శంకుస్థాపన, ఎస్ఎల్ బిసి పనులలో పురోగతి, ఆగస్టు 2028 నాటికి పూర్తి చేస్తాం. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ నల్లగొండ క్లబ్‌లో మంచి వాతావరణం ఉందని, పట్టణ ప్రజలకు ఇది ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని అన్నారు. క్లబ్ అభివృద్ధికి తన వంతు సహకారం ఎల్లప్పుడూ ఉంటుందని తెలిపారు. నల్లగొండ పట్టణ ప్రజలకు 24 గంటల తాగునీరు అందించేందుకు రూ.125 కోట్లతో పనులు చేపట్టడం జరిగిందని, ఆరు నెలల్లో పనులు పూర్తిచేసి తాగునీరు అందించేందుకు చర్యలు తీసుకుంటామని చెప్పారు.ఎస్ఎల్‌బీసీ సొరంగ మార్గం పూర్తి చేయడం తన ప్రధాన లక్ష్యాల్లో ఒకటని , సీఎం ఇచ్చిన హామీ మేరకు మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి సహకారంతో నిధులు సమకూర్చుకుని పనులను ముందుకు తీసుకెళ్తున్నామని తెలిపారు. ఆగస్టు 2028 నాటికి సొరంగ పనులను పూర్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నామని చెప్పారు. గతంలో రూ.2 వేల కోట్లు ఉన్న ఎస్ ఎల్ బి సి అంచనా వ్యయం ప్రస్తుతం రూ.5 వేల కోట్లకు పెరిగిందని, సొరంగ పనుల్లో ఇప్పటికే చాలా పురోగతి సాధించామని తెలిపారు. ప్రతి ఎకరాకు సాగునీరు అందించాలనే లక్ష్యంతో ప్రాజెక్టులను ముందుకు తీసుకెళ్తున్నామని మంత్రి చెప్పారు. నల్లగొండ పట్టణ అభివృద్ధిలో భాగంగా రూ.900 కోట్లతో ఔటర్ రింగ్ రోడ్డు నిర్మిస్తున్నామని, పట్టణంలో ట్రాఫిక్ ప్రమాదాలను తగ్గించడంతో పాటు, నల్లగొండను అందమైన నగరంగా తీర్చిదిద్దేందుకు రోడ్ల అభివృద్ధికి పెద్దపీట వేస్తున్నామని ,సుమారు రూ.1,400 కోట్ల విలువైన పనులు ప్రస్తుతం కొనసాగుతున్నాయని చెప్పారు. రూ.300 కోట్లతో అండర్ డ్రైనేజీ వ్యవస్థను అభివృద్ధి చేసి ప్రతి వార్డులో సీసీ రోడ్లు, డబల్ రోడ్లు నిర్మిస్తామని తెలిపారు. నేషనల్ ఫండ్ నుంచి రూ.15 కోట్లతో పట్టణంలోని రోడ్లను అభివృద్ధి చేసి పరిశుభ్రంగా ఉంచేందుకు చర్యలు తీసుకుంటామని చెప్పారు.

జిల్లాలో రూ.2,500 కోట్లతో రోడ్ల నిర్మాణానికి చర్యలు

రాష్ట్రవ్యాప్తంగా రూ.1,300 కోట్లతో హ్యామ్ రోడ్ల పనులు చేపడుతున్నామని, ఉమ్మడి నల్లగొండ జిల్లాలో రూ.2,500 కోట్లతో రోడ్ల నిర్మాణానికి చర్యలు తీసుకుంటున్నామని మంత్రి తెలిపారు. తాను ఎక్కడ ఉన్నా నల్లగొండకు అత్యంత ప్రాధాన్యం ఇస్తానని స్పష్టం చేశారు. నల్లగొండ క్లబ్ అభివృద్ధికి పక్కనే ఉన్న ఎకరం స్థలాన్ని కూడా సమకూర్చేందుకు చర్యలు తీసుకుంటానని మంత్రి హామీ ఇచ్చారు. కలెక్టర్‌తో మాట్లాడి క్లబ్‌కు భూమి ఇప్పించేందుకు కృషి చేస్తానని తెలిపారు. హైదరాబాద్ జూబ్లీహిల్స్‌లోని క్లబ్ మాదిరిగా నల్లగొండ క్లబ్‌ను కూడా మరింత అభివృద్ధి చేసేందుకు సహకరిస్తానని చెప్పారు.

నల్గొండ పట్టణంలోని బొట్టుగూడ పాఠశాల నిర్మాణానికి రూ.12 కోట్లు కేటాయించి అభివృద్ధి చేశానని మంత్రి తెలిపారు. విద్యార్థుల భవిష్యత్‌ను దృష్టిలో పెట్టుకుని పాత టౌన్‌లో రూ.10 కోట్లతో త్వరలో లైబ్రరీ నిర్మించడంతో పాటు, విద్యార్థులకు కోచింగ్, ఫౌండేషన్ సౌకర్యాలు కల్పించేందుకు చర్యలు తీసుకుంటామని చెప్పారు.

నల్లగొండ పట్టణం, నియోజకవర్గ అభివృద్ధికి అవసరమైన ప్రతి పనిని ప్రాధాన్యతతో చేపట్టి ప్రజలకు మెరుగైన మౌలిక వసతులు కల్పించడమే తన లక్ష్యమని మంత్రి అన్నారు.

నగర మేయర్ బుర్రి చైతన్య శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి సహకారంతో కార్పొరేషన్ లో వందల కోట్ల రూపాయలతో ఎన్నో అభివృద్ధి పనులు జరుగుతున్నాయని అన్నారు. నల్లగొండ క్లబ్ అభివృద్ధికి కార్పొరేషన్ తరపున పూర్తి సహకారం అందిస్తామని తెలిపారు. కార్యక్రమంలో స్థానిక సంస్థల ఇంచార్జ్ అదనపు కలెక్టర్ ప్రేమ్ కరణ్ రెడ్డి, ఆర్డీవో వై.అశోక్ రెడ్డి ,క్లబ్ అధ్యక్షుడు గోలి అమరేందర్ రెడ్డి,మాజీ మున్సిపల్ చైర్మన్ బుర్రి శ్రీనివాస రెడ్డి, మాజీ జెడ్పిటిసి గుమ్మల మోహన్ రెడ్డి,స్థానిక కార్పొరేటర్ ఏదుళ్ల శ్రీధర్ రెడ్డి, గుమ్మల జానకి రెడ్డి , క్లబ్ సెక్రటరీ చల్ల వెంకటరమణ, కాసర్ల వెంకటరెడ్డి , క్లబ్ మెంబర్స్ డాక్టర్ పుల్లారావు తదితరులు పాల్గొన్నారు.

శ్రీ రామలింగేశ్వర స్వామి, పార్వతీదేవి అమ్మవార్ల ఉపాలయాల ప్రతిష్ఠా మహోత్సవం ఘనంగా ముగింపు

భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఆగస్టు 23 (వుదయం ప్రతినిధి)

దేవాదాయ ధర్మాదాయ శాఖ ఆధ్వర్యంలో భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కొత్తగూడెం పట్టణంలోని శ్రీ పాండురంగ భజన మందిరం ప్రాంగణంలో శ్రీ రామలింగేశ్వర స్వామివారు, శ్రీ పార్వతీదేవి అమ్మవార్ల ఉపాలయాల ప్రతిష్ఠా మహోత్సవాలు ఐదు రోజులపాటు పాంచాహ్నిక దీక్షాపూర్వకంగా వైభవంగా నిర్వహించారు. ఆదివారం ఐదవ రోజు, ఆఖరి రోజున ఉదయం 6 గంటలకు మంగళ వాయిద్యాలతో కార్యక్రమాలు ప్రారంభమయ్యాయి. అనంతరం ఉదయం 8.30 గంటల నుంచి ప్రాతఃకాల అర్చనలు, అభిషేకాలు, హోమాది కార్యక్రమాలను శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఉదయం 10.30 గంటలకు మూర్తుల స్థానములు, గర్తన్యాసం, బీజ, ఓషధి, రత్నన్యాస కార్యక్రమాలు చేపట్టారు.ఉదయం 11.25 గంటలకు మూలా నక్షత్ర యుక్త తులా లగ్నంలో యంత్ర, విగ్రహ స్థిర ప్రతిష్ఠ కార్యక్రమాన్ని అత్యంత వైభవంగా నిర్వహించారు. మధ్యాహ్నం 12 గంటలకు భక్తులకు అన్నప్రసాద వితరణ చేపట్టారు. అనంతరం మధ్యాహ్నం 1 గంటకు శాంతి కల్యాణం, బలిహరణ, ధేను దర్శనం కార్యక్రమాలు నిర్వహించి భక్తులకు స్వామివారి దర్శనం, ఆశీర్వచనం కల్పించారు. ఈ ప్రతిష్ఠా మహోత్సవ కార్యక్రమాలను బ్రహ్మర్షి శ్రీ చేబ్రోలు సుబ్రహ్మణ్య శర్మ ఆధ్వర్యంలోని వేద పండితులు, అర్చక బృందం శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఐదు రోజులపాటు జరిగిన ఈ మహోత్సవాల్లో భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని స్వామివారి ఆశీస్సులు పొందారు. కార్యక్రమాల్లో ఆలయ కార్యనిర్వహణాధికారి శ్రీమతి కె. సులోచన, ఆలయ అర్చకులు, సిబ్బంది, ఆలయ నిర్మాణ దాతలు, భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

సామూహిక బోనాలు

యాదాద్రి భువనగిరి జిల్లా , 23 ఆగస్టు 2026

పట్టణంలోని అర్బన్ కాలనీ, హనుమాన్‌వాడలో నిర్వహించిన సామూహిక బోనాల వేడుకల్లో భువనగిరి నియోజకవర్గ ఎమ్మెల్యే కుంభం అనిల్‌కుమార్‌రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా అర్బన్ కాలనీ ప్రజలు ఎమ్మెల్యేకు ఘన స్వాగతం పలికారు. అనంతరం అమ్మవారికి ఎమ్మెల్యే ప్రత్యేక పూజలు నిర్వహించారు. ప్రజలందరూ సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో వర్ధిల్లాలని అమ్మవారిని ప్రార్థించారు. బోనాల పండుగ సందర్భంగా కాలనీ ప్రజలకు ఎమ్మెల్యే హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో భువనగిరి మున్సిపల్ చైర్‌పర్సన్ తంగళ్లపల్లి శ్రీవాణి–రవికుమార్, జిల్లా గ్రంథాలయ చైర్మన్ అవేస్ చిస్తి, మున్సిపల్ వైస్ చైర్‌పర్సన్ పోతంశెట్టి మంజుల–వెంకటేశ్వర్లు, పట్టణ కాంగ్రెస్ అధ్యక్షులు కూర వెంకటేష్, స్థానిక కౌన్సిలర్లు, కో–ఆప్షన్ సభ్యులు, సీనియర్ కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, మహిళలు, స్థానిక ప్రజలు, ఉత్సవ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

ఒక ఎమ్మెల్యే...100 కుట్రలు..!

- **పద్మవ్యూహాన్ని ఛేదిస్తున్న మట్టా దంపతులు**
- **సత్తుపల్లి నియోజకవర్గంలో కుట్రలపై అభివృద్ధే అస్త్రంగా పోరాటం!**

కల్లూరు,ఆగస్టు 23 (వుదయం ప్రతినిధి)

సత్తుపల్లి రాజకీయాలు రోజుకో రంగు మారుతున్నాయి. ప్రజాస్వామ్య విలువలకు పాతర వేస్తూ, స్వార్థ రాజకీయాలకు పెద్దపీట వేస్తున్న ప్రస్తుత తరుణంలో సత్తుపల్లి నియోజకవర్గ శాసనసభ్యురాలు డాక్టర్ మట్టా రాగమయి దయానంద్ చుట్టూ జరుగుతున్న రాజకీయ చదరంగం ఇప్పుడు నియోజకవర్గంలో తీవ్ర చర్చనీయాంశంగా మారింది. అడుగడుగునా ఎదురవుతున్న 100 కుట్రలను ఎదురొడ్డి, అభివృద్ధి అజెండాతో మట్టా దంపతులు ముందుకు సాగుతున్న తీరు ప్రజల మన్ననలు పొందుతోంది.

రంగులు మారుతున్న సమీకరణాలు కుట్రల వలయం!

సత్తుపల్లి నియోజకవర్గంలో ఎమ్మెల్యేను ఒంటరిని చేయాలని అనేక ప్రయత్నాలు జరుగుతున్నాయి. ఒకవైపు ప్రతిపక్షాలు కులాల వారీగా ప్రజలను ఎమ్మెల్యేకు దూరం చేయాలని చూస్తుంటే, మరోవైపు కాంగ్రెస్ పార్టీలోని కొందరు నాయకులు అసమ్మతిని ప్రోత్సహిస్తూ రాజకీయ విధ్వంసానికి తెరతీస్తున్నారు. అంతా కుమ్మక్కై, పైకి మాత్రం ఎమ్మెల్యే దగ్గర మంచి వాళ్ళ లాగా నటిస్తూ వెన్నుపోటు రాజకీయాలకు పాల్పడుతున్నారు. డబ్బే ప్రధానంగా రాజకీయ సిద్ధాంతాలను గాలికి వదిలేసి, తమకు లబ్ధి చేకూరకపోతే అవినీతి రహిత పాలన అందిస్తున్న ఎమ్మెల్యే మట్ట దంపతులను ప్రభుత్వం పైనా తిరుగుబాటు చేసేందుకు కొందరు నాయకులు, కార్యకర్తలు సిద్ధమయ్యారు. వీరికి తోడు అడుగడుగునా లంచగొండితనంతో వ్యవస్థను భ్రష్టు పట్టిస్తున్న అధికారుల తీరు నియోజకవర్గంలో పరిస్థితులను మరింత ప్రతికూలంగా మార్చింది.

ఎమ్మెల్యేకు కవచంలా డాక్టర్ మట్టా దయానంద్ విజయ్ కుమార్

తన రెండున్నర ఏళ్ల పరిపాలనలో సొంత మనుషులతోనే అత్యంత పోరాడి నెగ్గుకొస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ మట్టా రాగమయికి కొండంత ధైర్యంగా నిలుస్తున్నారు డాక్టర్ మట్టా దయానంద్ విజయ్ కుమార్. అసమ్మతి నాయకులు, ప్రతిపక్షాలు పన్నుతున్న 100 కుట్రలను ఆయన తన పదునైన రాజకీయ వ్యూహాలతో ఎప్పటికప్పుడు తిప్పికొడుతున్నారు. ఎమ్మెల్యేకు నీడలా ఉంటూ, ఆమెను ఈ రాజకీయ పద్మవ్యూహంలో చిక్కుకోకుండా నిరంతరం ప్రజల వైపే నడిపిస్తున్నారు. ప్రతిపక్షాలు విసురుతున్న 100 తూటాల లాంటి సమస్యల వలయాన్ని ఛేదిస్తూ, వారి కుతంత్రాలకు దీటైన సమాధానం చెబుతున్నారు.

సంక్షేమం, అభివృద్ధే మా విధానం!

రాజకీయ విలువలను పాతిపెడుతూ, ప్రభుత్వ విధానాలను మంటగలుపుతున్న వారికి ఎమ్మెల్యే డాక్టర్ మట్టా దంపతులు విశ్వసనీయత, మానవతా విలువలు, నిరంతరం ప్రజాసేవ తోనే సమాధానం చెబుతున్నారు. పరిస్థితులు ఎంత ప్రతికూలంగా ఉన్నా, వాటిని ప్రజలకు అనుకూలంగా మారుస్తున్నారు. "ప్రజలకు మంచి చేయటం, నియోజకవర్గ అభివృద్ధి, సంక్షేమమే మా విధానం" అని బలంగా చాటి చెబుతున్నారు.

సత్తుపల్లి నియోజకవర్గ అభివృద్ధి కోసం రాష్ట్ర ప్రభుత్వ పెద్దలతో సైతం పోరాడి నిధులు తీసుకొస్తున్నారు. రాజకీయ కుట్రలను పక్కనపెట్టి, ప్రజా సమస్యల పరిష్కారమే ధ్యేయంగా ముందుకు వెళ్తున్నారు. ఒకవైపు నాయకుల అసమ్మతి, మరోవైపు కుట్రలు జరుగుతున్నా ఏమాత్రం వెనక్కి తగ్గకుండా, నియోజకవర్గంలో అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను పరుగులు పెట్టిస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ మట్టా దంపతుల పనితీరుపై సత్తుపల్లి ప్రజలు ప్రశంసల జల్లు కురిపిస్తున్నారు.

మధిర వైరా నదిలో రిటైనింగ్ వాల్ పనులను పరిశీలించిన కాంగ్రెస్ నాయకులు

మధిర, ఆగస్టు 23, వుదయం ప్రతినిధి:

మధిర వైరా నదిలో నిర్మాణం జరుగుతున్న రిటైనింగ్ వాల్ పనులను అధికారులతో కలిసి మధిర మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు పారుపల్లి విజయ్ కుమార్,రామాలయ కమిటీ చైర్మన్ పంగవీటి రాజశేఖర్ మరియు కాంగ్రెస్ నాయకులు పరిశీలించారు.ఈ సందర్భంగా రిటైనింగ్ వాల్ పనుల పురోగతిని అధికారులను అడిగి తెలుసుకుని, పనులు నాణ్యతా ప్రమాణాలతో, వేగవంతంగా పూర్తి చేయాలని సూచించారు.నది పరివాహక ప్రాంత ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అవసరమైన చర్యలు చేపట్టాలని అధికారులను కోరారు.

శీలం సిద్ధారెడ్డి జయంతి

మధిర, ఆగస్టు 23, వుదయం ప్రతినిధి:

మాజీ మంత్రి, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు శీలం సిద్ధారెడ్డి జయంతి కార్యక్రమాన్ని కాంగ్రెస్ నాయకులు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ప్రజా సేవకు శీలం సిద్ధారెడ్డి చేసిన కృషి నేటి తరానికి స్ఫూర్తిదాయకమని ఖమ్మం జిల్లా కాంగ్రెస్ పార్టీ ఉపాధ్యక్షులు వేమిరెడ్డి సుధాకర్‌రెడ్డి అన్నారు.ఈ కార్యక్రమంలో మధిర మార్కెట్ కమిటీ చైర్మన్ బండారు నరసింహారావు,లాయర్ శీలం చెన్నారెడ్డి, వాసంశెట్టి కోటేశ్వరరావు, పత్తేపురపు సంగయ్య, షేక్ జాకీర్ హుస్సేన్, అనుమోల కృష్ణారావు, గుటేటి బాబురావు, దేవరకొండ రాజీవ్‌గాంధీ, సర్పంచ్ బలుసుపాటి జయరాజు, ఉపసర్పంచ్ వేమిరెడ్డి రామిరెడ్డి, సొసైటీ చైర్మన్ శీలం అక్కిరెడ్డి,కుడుముల వెంకటరామిరెడ్డి, యన్నం సత్యనారాయణరెడ్డి, రిటైర్డ్ హెడ్‌మాస్టర్ బొగ్గుల వీరారెడ్డి పాల్గొన్నారు.

పాలకులు పత్తాలేరు.. ప్రజలే పాలకులయ్యారు!

- **డి. అమరవాయిలో పాలనపై ప్రజాగ్రహం.. తట్టా, పార పట్టిన గ్రామస్థులు**
- **ఓట్లు వేసి గెలిపించిన నాయకులు కనిపించరు.. సమస్యలు తీరవు**
- **"మా గ్రామాన్ని మేమే బాగు చేసుకుంటాం" అంటూ ప్రజల శ్రమదానం**

మల్దకల్ ఆగస్టు 23 (వుదయం బ్యూరో)

ఓట్లు అడిగేటప్పుడు చేతులు జోడించి ఇంటింటికీ వచ్చిన నాయకులు.. గెలిచిన తర్వాత గ్రామం వైపు కన్నెత్తి చూడటం లేదని డి. అమరవాయి గ్రామస్థులు మండిపడుతున్నారు. రహదారులు గుంతలమయం.. డ్రైనేజీలు పూడికతో నిండిపోయాయి.. వీధులు పిచ్చిమొక్కలతో కంపుకొడుతున్నాయి.. దోమలు, ఈగలతో ప్రజలు అవస్థలు పడుతున్నారు. అయినా పట్టించుకునే పాలకులు కనిపించడం లేదని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఎన్నిసార్లు చెప్పాలి? ఇంకా ఎన్ని రోజులు ఎదురుచూ దాలి?" అంటూ విసిగిపోయిన గ్రామస్థులు చివరకు చేతుల్లో తట్టా, పార పట్టుకున్నారు. పంచాయతీ చేయాల్సిన పనులను తామే చేపట్టి.. "పాలకులు పత్తాలేకపోతే.. మా పనులు మేమే చేసుకుంటాం" అంటూ నిరసన తెలిపారు. పాలకుల నిర్లక్ష్యానికి ఇదే నిదర్శనం జోగులాంబ గద్వాల జిల్లా మల్దకల్ మండలంలోని డి. అమరవాయి గ్రామ పంచాయతీ పరిధిలో పలు వీధులు కనీస వసతులకు దూరంగా ఉన్నాయని స్థానికులు ఆరోపిస్తున్నారు. రహదారులపై పెద్ద గుంతలు ఏర్పడటంతో రాకపోకలకు ఇబ్బందులు ఎదురవుతున్నాయి. డ్రైనేజీ కాలువలు పూడుకుపోయి మురుగునీరు నిలిచిపోవడంతో దుర్వాసన, దోమల బెడద పెరిగిందని చెబుతున్నారు.

పంచాయతీ పనులు.. ప్రజల చేతుల్లోకి!

గ్రామంలో పారిశుధ్య పనులు జరగకపోవడంతో ప్రజలే రంగంలోకి దిగారు. కాలువల్లో పేరుకుపోయిన పూడికను తొలగిస్తూ.. వీధుల్లోని పిచ్చిమొక్కలను తొలగిస్తూ.. రోడ్లపై గుంతలను రాళ్లు, సిమెంట్‌తో పూడ్చుకుంటున్నారు. కొందరు సొంత డబ్బులు వెచ్చిస్తుండగా.. మరికొందరు శ్రమదానం చేస్తున్నారు. ప్రజల కోసం పనిచేయాల్సిన వ్యవస్థే చేతులెత్తేయ డంతో.. ప్రజలే కార్మికులుగా మారాల్సిన దుస్థితి వచ్చిందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. నిధులు వస్తున్నాయా.. వస్తే ఎక్కడ ఖర్చవుతున్నాయి?" గ్రామాభివృద్ధి కోసం పంచాయతీకి నిధులు వస్తున్నాయా? వస్తే అవి ఎక్కడ ఖర్చవుతున్నాయి? అని గ్రామస్థులు నిలదీస్తున్నారు. కనీసం రోడ్లు, డ్రైనేజీలు, పారిశుధ్యం వంటి ప్రాథమిక సమస్యలు కూడా పరిష్కారం కాకపోతే పంచాయతీ నిధుల ప్రయోజనం ఏమిటని ప్రశ్నిస్తు న్నారు. నిధుల కేటాయింపులు, ఖర్చుల వివరాలను ప్రజల ముందు పెట్టాలని డిమాండ్ చేస్తున్నారు. ఎన్నికలప్పుడు చేతులు జోడించి.. గెలిచాక చేతులు దులుపుకున్నారా? ఎన్నికల సమయంలో ఓట్ల కోసం హామీల వర్షం కురిపించే నాయకులు.. గెలిచిన తర్వాత ప్రజల సమస్యలను పట్టించుకోవడం లేదని గ్రామస్థులు తీవ్రంగా మండిపడుతున్నారు.

ఓట్లు అడిగేటప్పుడు మేము గుర్తొస్తాం.. గెలిచిన తర్వాత మా సమస్యలు ఎందుకు గుర్తుకురావు?" అంటూ ప్రశ్నిస్తున్నారు. వ్యాధుల ముప్పు పొంచి ఉందంటున్న ప్రజలు మురుగునీరు నిల్వ ఉండటం, డ్రైనేజీలు శుభ్రం కాకపోవడంతో దోమలు, ఈగలు పెరిగిపోతున్నాయని స్థానికులు చెబుతున్నారు. వర్షాకాలంలో పరిస్థితి మరింత విషమించి ప్రజారోగ్యంపై ప్రభావం చూపే అవకాశం ఉందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఉన్నతాధికారులు ఇకనైనా మేల్కొనాలి డి. అమరవాయి గ్రామంలో నెలకొన్న పరిస్థితులపై జిల్లా, మండల స్థాయి అధికారులు వెంటనే స్పందించాలని గ్రామస్థులు డిమాండ్ చేస్తున్నారు. గ్రామంలోని రహదారులు, డ్రైనేజీలు, పారిశుధ్య సమస్యలను తక్షణమే పరిష్కరించాలని కోరుతున్నారు. పంచాయతీ నిధుల వినియోగంపై సమగ్ర విచారణ జరిపి.. ప్రజల సమస్యలను నిర్లక్ష్యం చేస్తున్న బాధ్యులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నారు. పాలకులు చేయాల్సిన పనులను ప్రజలే చేసుకుంటున్న ఈ దృశ్యం.. డి. అమరవాయిలో పాలన ఎంత నిర్లక్ష్యానికి గురైందో చెప్పకనే చెబుతోందని గ్రామస్థులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

స్వచ్ఛత పక్వాడా – హర్ ఘర్ తిరంగా కార్యక్రమం

యాదాద్రి భువనగిరి జిల్లా, 23 ఆగస్టు 2026

భువనగిరి ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానంలో మై భారత్ – నవభారత్ యూత్ అసోసియేషన్ సంయుక్త ఆధ్వర్యంలో స్వచ్ఛత పక్వాడా, హర్ ఘర్ తిరంగా ర్యాలీ మరియు వ్యాసరచన పోటీలు నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమంలో నవభారత్ యూత్ అసోసియేషన్ అధ్యక్షుడు సరగడ కరుణ్ పాల్గొని యువత, విద్యార్థులకు స్వచ్ఛత, దేశభక్తి మరియు సామాజిక బాధ్యతపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో కళాశాల లెక్చరర్లు వెంకటేశం, హరికృష్ణ, ఇమ్రాన్, శ్రీనివాస్ రెడ్డి, సుమా, అవనీధర్, నర్సింహ, నవభారత్ యూత్ అసోసియేషన్ సభ్యులు, విద్యార్థిని విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు. దేశభక్తి, పరిశుభ్రత, సామాజిక బాధ్యత వంటి విలువలను యువతలో పెంపొందించేందుకు ఇలాంటి కార్యక్రమాలు ఎంతో ఉపయోగకరమని నిర్వాహకులు తెలిపారు.

వంగవీడులో ఘనంగా సంత్ సేవాలాల్ మహారాజ్, మేరమా యాడి ఆరాధన

వంగవీడు,ఆగస్టు 23, వుదయం ప్రతినిధి:

మధిర మండలం వంగవీడు గ్రామంలో బంజారా సమాజ ఆరాధ్య దైవం సంత్ శ్రీ సేవాలాల్ మహారాజ్, మేరమా యాడి ఆరాధన వేడుకలను తండా ప్రజలు భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సంప్రదాయ పద్ధతిలో భోగ్,హోమం,ప్రత్యేక పూజలు నిర్వహించారు.గ్రామ ప్రజలకు సుఖశాంతులు, ఆరోగ్యం, పంటల సమృద్ధి, పశుసంపద అభివృద్ధి కలగాలని ప్రార్థించారు. కార్యక్రమంలో తండా నాయక్, కార్బారి, పెద్దలు,మహిళలు,యువత, బంజారా ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

24న అచ్చంపేట నియోజకవర్గం లో మంత్రులు దామోదర, కోమటిరెడ్డి, జూపల్లి పర్యటన

అచ్చంపేట,ఆగస్టు23:(వుదయం ప్రతినిధి)

నాగర్‌కర్నూల్ జిల్లా అచ్చంపేట నియోజకవర్గం లో ఈ నెల 24న వైద్య, ఆరోగ్య & ఉమ్మడి మహబూబ్ నగర్ జిల్లా ఇంచార్జ్ మంత్రి దామోదర రాజనర్సింహా, రహదారులు, భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి, పర్యాటక, సాంస్కృతిక, ఎక్సైజ్ శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు, సోమవారం పర్యటించనున్నారు.

పర్యటనలో భాగంగా మొత్తం రూ.474.82 కోట్ల అంచనా వ్యయంతో వివిధ ప్రాంతాల్లో హైబ్రిడ్ యాన్యుటీ మోడల్ (HAM) తొలి దశ ప్యాకేజీల కింద చేపట్టనున్న రహదారి అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు చేయనున్నారు. అచ్చంపేట నియోజకవర్గంలోని బల్మూర్‌లో రూ.146.71 కోట్ల అంచనా వ్యయంతో 3 హ్యామ్ రహదారి పనులకు శంకుస్థాపన చేస్తారు. ఇందులో అమ్రాబాద్–ఇప్పలపల్లి రహదారి బలోపేతం, బల్మూర్–నాగర్‌కర్నూల్ పీడబ్ల్యూడీ రహదారి విస్తరణ, అచ్చంపేట–రాకొండ రహదారి విస్తరణ పనులు ఉన్నాయి. అనంతరం వనపర్తిలో కర్నెతండ లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టును ప్రారంభిస్తారు. తర్వాత కొల్లాపూర్ నియోజకవర్గంలో, లింగాల మండలంలో రూ.171.75 కోట్ల అంచనా వ్యయంతో ఏడు రహదారి అభివృద్ధి పనులకు భూమిపూజ చేయనున్నారు. పెంట్లవెల్లి–వనపర్తి, పెంట్లవెల్లి–శ్రీరంగాపూర్, పెద్దకార్పాముల–అంబట్పల్లి, రాజాపూర్–ఏదుల, కొల్లాపూర్–లింగాల, తీగలపల్లి–ఏదుల, షనాయిలపల్లి–గౌరెడ్డిపల్లి రహదారుల విస్తరణ, బలోపేతం పనులు ఇందులో ఉన్నాయి. ఈ పనులతో ఆయా ప్రాంతాల్లో రహదారి సౌకర్యాలు మెరుగుపడి, గ్రామాలు–మండల కేంద్రాలు–ప్రధాన పట్టణాల మధ్య రవాణా మరింత సులభతరం కానుంది.

కిష్టారంలో 25 క్వింటాళ్ల బియ్యం పట్టుకున్న పోలీసులు

సత్తుపల్లి ఆగస్టు 23 (వుదయం ప్రతినిధి)

సత్తుపల్లి మండల పరిధిలోని కిష్టారంలో 25 క్వింటాళ్ల రేషన్ బియ్యం ను పోలీసులు పట్టుకున్నారు. 25 క్వింటాళ్ల రేషన్ బియ్యం ఆటోలో కాకినాడకు అక్రమంగా తరలిస్తున్నారని పోలీసులకు విశ్వసనీయమైన సమాచారం మేరకు పోలీసులు దాడి చేసి పట్టుకున్నారు. 25 క్వింటాల బియ్యం ఆటోను స్వాధీన పరుచుకొని సివిల్ సప్లై అధికారులకు అప్పచెప్పారు. అదేవిధంగా నక్క వెంకటేశ్వరావు ఏపీకి చెందిన రాజా కాకినాడకు చెందిన బాబీలపై కేసు నమోదు చేశారు. ఇంకా వివరాలు తెలియాల్సి ఉంది

సామూహిక బోనాల ఉత్సవాల్లో పాల్గొన్న ఎమ్మెల్యే కుంభం అనిల్‌కుమార్‌రెడ్డి

యాదాద్రి భువనగిరి జిల్లా, 23 ఆగస్టు 2026

వలిగొండ పట్టణంలో బోనాల పండుగ సందర్భంగా నిర్వహించిన సామూహిక బోనాల మహోత్సవంలో భువనగిరి నియోజకవర్గ ఎమ్మెల్యే కుంభం అనిల్‌కుమార్‌రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించి, భక్తులతో కలిసి బోనాల ఉత్సవాల్లో పాల్గొన్నారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే బోనాల పండుగను ప్రజలు భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించడం ఆనందదాయకమన్నారు. ఇలాంటి పండుగలు సమాజంలో ఐక్యత, ఆధ్యాత్మికతతో పాటు సాంస్కృతిక విలువలను మరింత పెంపొందిస్తాయని పేర్కొన్నారు.

అమ్మవారి కృపాకటాక్షాలతో వలిగొండ ప్రజలందరూ సుఖశాంతులు, ఆయురారోగ్యాలు, సిరిసంపదలతో వర్ధిల్లాలని ఎమ్మెల్యే ఆకాంక్షించారు. కార్యక్రమంలో వలిగొండ పట్టణ నాయకులు, సీనియర్ నాయక